ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రిక

## రిపోర్టర్లు కావలెను

అత్యంత ప్రజాదరణ పొందిన ప్రభాత ఉదయం
తెలుగు దినపత్రికలో పనిచేయుటకు తెలంగాణ వ్యాప్తంగా
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల వారీగా
రిపోర్టర్లు కావలెను.

ఉదయం

సంప్రదించండి
ఫోన్: 93910 89608

సంపుటి: 3 | సంచిక: 303 | పేజీలు: 6 | వెల: రూ.3/- | బుధవారం 11 ఫిబ్రవరి 2026 | ఎడిటర్: ఎం.దామోదర్ రెడ్డి

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

### తెలంగాణలో 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లకు బుధవారం పోలింగ్

### ఓటు హక్కును వినియోగించుకోనున్న 52 లక్షల మందికి పైగా ఓటర్లు

### మొత్తం 2,981 వార్డులకు బరిలో 12,944 మంది అభ్యర్థులు




**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో పురపాలక ఎన్నికల పోరుకు రంగం సిద్ధమైంది. రాష్ట్రవ్యాప్తంగా 116 మున్సిపాలిటీలు, 7 కార్పొరేషన్లలో బుధవారం (ఫిబ్రవరి 11) పోలింగ్ జరగనుండగా, ఇందుకు రాష్ట్ర ఎన్నికల సంఘం (రాఎస) అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. మొత్తం 123 పట్టణ స్థానిక సంస్థల్లో ప్రశాంత వాతావరణంలో ఎన్నికలు నిర్వహించేందుకు అధికారులు సర్వం సిద్ధం చేశారు. ఈ ఎన్నికల్లో మొత్తం 52,17,413 మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. వీరి కోసం 8,191 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. పోలింగ్ ప్రక్రియ బుధవారం ఉదయం 7 గంటలకు ప్రారంభమై సాయంత్రం 5 గంటల వరకు కొనసాగనుంది.

రాష్ట్ర ఎన్నికల కమిషనర్ రాణి కుముదిని మాట్లాడుతూ, ఎన్నికల నిర్వహణ కోసం 1,379 మంది రిటర్నింగ్ అధికారులు, 41,773 మంది పోలింగ్ సిబ్బందిని నియమించినట్లు తెలిపారు. ఓటర్లు తమ ఓటర్ స్లిప్పులను ఎస్ఈసీ వెబ్‌సైట్ లేదా ౹జు-౹ాాాా యాప్ ద్వారా డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు. మొత్తం 2,981 వార్డులకు గాను 12,944 మంది అభ్యర్థులు తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు.

వివరాల్లోకి వెళ్తే, 116 మున్సిపాలిటీల్లోని 2,569 వార్డులకు పోలింగ్ ..మిగతా 2లో




## నా పేరును మార్చడానికి మీరెవరు?

### రేవంత్ రెడ్డిపై కిషన్ రెడ్డి ఆగ్రహం

మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలువడమేమిటని ఆగ్రహం

అవసరమైతే రేవంత్ ఖాన్‌గా మార్చుకోవాలని ఎద్దేవా

అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీత

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

మా తల్లి పెట్టిన పేరును మార్చి పిలవడానికి మీరెవరంటూ తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిపై కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. తాను ఎవరికో దత్తపుత్రుడినని, కల్వకుంట్ల కిషన్ రావు అని పేరు మార్చుకోవాలని ముఖ్యమంత్రి విమర్శలు చేయడం ఏంటని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. తన పేరు మార్చి పిలవడం సరికాదని అన్నారు. కేసీఆర్, రేవంత్ రెడ్డి మధ్య ఏమైనా ఉంటే వారే తేల్చుకోవాలని, తనను మధ్యలోకి లాగవద్దని సూచించారు. అంతగా అవసరమైతే మీరు రేవంత్ ఖాన్ అని మార్చుకోవచ్చని, తమకు ఎలాంటి అభ్యంతరం ..మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికల వేళ.. మక్తల్‌లో భాజపా అభ్యర్థి ఆత్మహత్య



**మక్తల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

మున్సిపల్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ భాజపా అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడం కలకలం రేపింది. ఈ ఘటన నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. మున్సిపాలిటీలోని ఆరో వార్డు పరిధి చందాపూర్ గ్రామానికి చెందిన మహదేవప్ప (48) భాజపా తరఫున కౌన్సిలర్‌గా ..మిగతా 2లో

## మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం

ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడి

బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్యపై దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపిన డీజీపీ

ఫోరెన్సిక్ ల్యాబ్ అగ్ని ప్రమాదం.. ఓటుకు నోటు కేసు డాక్యుమెంట్లపై స్పందించిన డీజీపీ

ఈ కేసులో ఆధారాలను కోర్టుకు సమర్పించినట్లు వెల్లడి




**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

నాంపల్లిలోని ఫోరెన్సిక్ సైన్స్ ల్యాబ్‌లో ఇటీవల జరిగిన అగ్ని ప్రమాదంపై విచారణ జరుగుతోందని తెలంగాణ రాష్ట్ర డీజీపీ శివధర్ రెడ్డి తెలిపారు. ఈ ప్రమాదం ఎలా జరిగిందో విచారణ జరుపుతున్నామని అన్నారు. ఓటుకు నోటు కేసులో కీలకమైన ఫైల్స్ తగలబడిపోయాయనే ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. 2015 నాటి ..మిగతా 2లో

## స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

### నోటీసులు ఇచ్చిన కాంగ్రెస్ తదితర పార్టీలు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాపై విపక్ష ఎంపీలు అవిశ్వాస తీర్మానం నోటీసులు ఇచ్చారు. మంగళవారం మధ్యాహ్నం కాంగ్రెస్ ఎంపీలు లోక్‌సభ సెక్రటరీ జనరల్‌కు నోటీసులు అందజేశారు. అవిశ్వాసం నోటీసులపై 119 మంది ఎంపీలు సంతకాలు చేశారు. కాంగ్రెస్, డీఎంకే, ఎస్పీ ఎంపీలు సంతకాలు చేసిన వారిలో ఉన్నారు. అయితే ఇండియా కూటమిలోని కొన్ని పార్టీలు అవిశ్వాసం నోటీసులపై సంతకాలు చేసేందుకు ఒప్పుకోలేదు. ఈ అవిశ్వాస తీర్మానానికి మద్దతు ..మిగతా 2లో

## అర్జున్ తెండుల్కర్ వివాహం.. ప్రధాని మోదీకి ఆహ్వానం



**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

క్రికెట్ దిగ్గజం సచిన్ తెండుల్కర్ తనయుడు అర్జున్ తెండుల్కర్ పెళ్లి నిశ్చయమైన సంగతి తెలిసిందే. తన స్నేహితురాలు సానియా చందోక్‌ను అతడు వివాహం చేసుకోబోతున్నాడు. మార్చి 5న ముంబయిలో వీరి వివాహం జరగనుంది. తన కుమారుడి వివాహ వేడుకకు రావాలంటూ సచిన్ కుటుంబసభ్యులతో కలిసి ప్రధాని నరేంద్ర మోదీకి మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేశారు. చందోక్ తల్లిదండ్రులు కూడా వెంట రాగా వారందరినీ మోదీ ఆత్మీయంగా పలకరించి కాబోయే వధూవరులను ఆశీర్వదించారు. అనంతరం మోదీతో ఇరు కుటుంబాలు కలిసి ఫొటో దిగాయి. అర్జున్, సానియా ప్రధానితో ప్రత్యేకంగా ఫొటో దిగారు. ఈ విషయాన్ని సచిన్ ఇన్‌స్టాగ్రామ్‌లో అభిమానులతో పంచుకున్నాడు. ముంబయికి చెందిన వ్యాపారవేత్త రవి ఘాయ్ మనవరాలే సానియా. ఆమె కూడా వ్యాపారవేత్త. ముంబయిలో మిస్టర్ పాస్ పెట్ స్పా సంస్థను నడుపుతోంది. చాలా ఏళ్ల నుంచి సచిన్ కుమార్తె సారాతో సానియాకు అనుబంధం ఉంది.



## నా మాటలు ఎలా లీక్ అయ్యాయి?

బీఆర్ఎస్ ఇప్పటికీ ఫోన్ ట్యాప్ చేస్తోందేమో!: పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి

బీఆర్ఎస్ నేతలపై మంత్రి అనుమానాలు

సమీక్షలో మాట్లాడిన మాటలు లీక్ అయ్యాయని వ్యాఖ్య

ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎవరు విన్నారో విచారణ చేయిస్తానని వెల్లడి

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

బీఆర్ఎస్ నేతలు ఇప్పటికీ ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడుతున్నారే మోననే అనుమానం వస్తోందని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి అన్నారు. తాను సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ అయ్యాయని ఆయన ఆందోళన వ్యక్తం చేశారు. ఖమ్మం జిల్లా ఎదులాపురం పురపాలక ఎన్నికలపై అధికారులతో నిర్వహించిన సమీక్షలో మాట్లాడిన విషయాలు బయటకు లీక్ కావడంపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులతో మాట్లాడిన మాటలు ఎలా విన్నారో పూర్తిస్థాయిలో విచారణ చేయిస్తానని ఆయన అన్నారు. ఫోన్ ట్యాపింగ్‌కు పాల్పడిన వారిపై చట్టపరంగా చర్యలు తప్పవని హెచ్చరించారు.

## బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు

కేంద్రం నుంచి కీలక ప్రకటన

బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్

శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి

ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి

2లో..

# తెలంగాణలో నేడు మున్సిపల్ ఎన్నికలు

మొదటి పేజీ తరువాయి...

జరగనుంది. తొమ్మిది మున్సిపాలిటీల్లో 12 మంది అభ్యర్థులు ఇప్పటికే ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ మున్సిపాలిటీల్లో అధికార కాంగ్రెస్ నుంచి 2,358 మంది, బీఆర్ఎస్ నుంచి 2,478 మంది, బీజేపీ నుంచి 2,252 మంది సహా మొత్తం 10,719 మంది అభ్యర్థులు బరిలో ఉన్నారు. అయితే, సోమవారం రాత్రి నారాయణపేట జిల్లా మక్తల్ మున్సిపాలిటీలో బీజేపీ అభ్యర్థి ఆత్మహత్య చేసుకోవడంతో ఆ వార్డులో పోలింగ్‌ను వాయిదా వేస్తున్నట్లు ఎస్ఈసీ ప్రకటించింది.

మున్సిపాలిటీల కోసం 6,017 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఇక 7 మున్సిపల్ కార్పొరేషన్లలోని 412 వార్డులకు ఎన్నికలు జరగనున్నాయి. మహబూబ్‌నగర్, రామగుండం కార్పొరేషన్లలో రెండు వార్డుల్లో అభ్యర్థులు ఏకగ్రీవమయ్యారు. ఈ కార్పొరేషన్లలో కాంగ్రెస్ నుంచి 410, బీఆర్ఎస్ నుంచి 401, బీజేపీ నుంచి 382 మంది సహా మొత్తం 2,225 మంది అభ్యర్థులు పోటీ చేస్తున్నారు. కార్పొరేషన్ల పరిధిలో 2,174 పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు.




పోలింగ్ నేపథ్యంలో రాష్ట్రవ్యాప్తంగా కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేశామని డీజీపీ బి. శివధర్ రెడ్డి తెలిపారు. రాష్ట్రంలో 1,302 పోలింగ్ కేంద్రాలను అత్యంత సమస్యాత్మకమైనవిగా, 1,926 కేంద్రాలను సమస్యాత్మకమైనవిగా గుర్తించామని, అక్కడ అదనపు బలగాలను మోహరించామని వివరించారు. పారదర్శకత కోసం అన్ని పోలింగ్ కేంద్రాల్లో వెబ్‌కాస్టింగ్ ఏర్పాటు చేశామని, సమస్యాత్మక ప్రాంతాల్లోని కేంద్రాల బయట నిఘా కెమెరాలు కూడా ఉపయోగిస్తున్నామని చెప్పారు.

# బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు

**కేంద్రం నుంచి కీలక ప్రకటన**

**బీసీ రిజర్వేషన్ల బిల్లులపై ప్రశ్నించిన బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్**

**శాసన సభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు వచ్చినట్లు కేంద్రం వెల్లడి**

**ప్రస్తుతం అవి పరిశీలనలో ఉన్నాయన్న కేంద్రమంత్రి**

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

తెలంగాణలో బీసీ రిజర్వేషన్ల పెంపు బిల్లులు పరిశీలనలో ఉన్నాయని లోక్ సభలో కేంద్ర ప్రభుత్వం తెలిపింది. తెలంగాణలో విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల ఎన్నికల్లో రిజర్వేషన్లను 42 శాతానికి పెంచడంపై బీజేపీ ఎంపీ ఈటల రాజేందర్ ప్రశ్నించారు. దీనితో కేంద్ర మంత్రి బీఎల్ వర్మ వివరణ ఇచ్చారు. రెండు బీసీ బిల్లులు రాష్ట్రపతి ఆమోదం కోసం వచ్చాయని, అవి పరిశీలనలో ఉన్నాయని స్పష్టం చేశారు. బీసీ రిజర్వేషన్ పెంపునకు సంబంధించి తెలంగాణ శాసనసభ కార్యదర్శి నుంచి రెండు బిల్లులు రాష్ట్రపతి ఆమోదానికి వచ్చాయని తెలిపారు. ఈ బిల్లులు ప్రస్తుతం పరిశీలనలో ఉన్నట్లు కేంద్ర మంత్రి వెల్లడించారు. రాష్ట్ర ప్రభుత్వం తెలంగాణ అసెంబ్లీలో ఆమోదం పొందిన రెండు బిల్లులను కేంద్ర ప్రభుత్వానికి పంపించడం తెలిసిందే.




# హెచ్-1బీ వీసా రద్దుకు బిల్లు

**న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

హెచ్-1బీ వీసాల అమలులో సంచలన పరిణామం చోటు చేసుకుంది. హెచ్-1బీ వీసాలను రద్దు చేయాలని అమెరికా ప్రతినిధుల సభలో రిపబ్లికన్ ఎంపీ స్టూబ్ బిల్లును ప్రవేశ పెట్టారు. విదేశీయులకు ప్రాధాన్యం ఇవ్వడం అమెరికాకు నష్టమన్న స్టూబ్.. అమెరికా యువతకు ఉద్యోగాలు రావడం లేదని వాదించారు. అమెరికా కాంగ్రెస్‌లో ఫ్లోరిడా రాష్ట్రానికి చెందిన రిపబ్లికన్ ప్రతినిధి గ్రెగ్ స్ట్యూబ్ ఒక సంచలనాత్మక బిల్లు ప్రవేశపెట్టారు. ఆయన ప్రవేశపెట్టిన ఈ బిల్లుకు పేరు. దీని ద్వారా అమెరికాలో ఉన్న హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్‌ను పూర్తిగా రద్దు చేయాలని ప్రతిపాదించారు.'విదేశీ కార్మికులను ప్రాధాన్యం ఇవ్వడం వల్ల అమెరికా పౌరుల సంక్షేమం, అభివృద్ధి దెబ్బతింటోంది. ఇది జాతీయ ప్రయోజనాలకు విరుద్ధం'అని అన్నారు. హెచ్-1బీ వీసా ప్రోగ్రామ్ కారణంగా అమెరికా యువత, కార్మికులు ఉద్యోగాలు కోల్పోతున్నారు. మన పిల్లలకు అమెరికన్ డ్రీమ్‌ను కాపాడాలంటే విదేశీయులకు పెద్దపీట వేయకూడదని స్పష్టం చేశారు. అదే సమయంలో గ్రెగ్ స్ట్యూబ్ బిల్లులో హెచ్-1బీ వీసా దుర్వినియోగం వల్ల అమెరికా కార్మికులు ఎలా నష్టపోయారో ఉదాహరణలు ఇచ్చారు. ఉదాహరణకు, 2015లో డిస్నీ 250 మంది ఉద్యోగులను తొలగించి, వారి స్థానంలో విదేశీ కార్మికులను హెచ్-1బీ వీసా ద్వారా తీసుకువచ్చింది. 2014లో సదర్న్ కాలిఫోర్నియా ఎడిసన్




540 మంది ఉద్యోగులను తొలగించి, భారతీయ ఔట్‌సోర్సింగ్ కంపెనీల ద్వారా వచ్చిన కార్మికులను నియమించింది. మైక్రోసాఫ్ట్‌లో 16,000 మంది ఉద్యోగులు తొలగింపులకు గురి కాగా.. ఆ సమయంలో 9వేల హెచ్-1బీ వీసాలు మంజూరయ్యాయని ఆయన గుర్తు చేశారు. ఈ బిల్లుతో అమెరికాలోని ఐటీ రంగం, ముఖ్యంగా భారతీయ వృత్తిపరులు దెబ్బతినే అవకాశం ఉంది. ఎందుకంటే హెచ్-1బీ వీసాలు లేకుండా అమెరికాలో ఉద్యోగాలు పొందడం చాలా కష్టమవుతుంది. ఇప్పటికే భారతదేశంలో వీసా ఇంటర్వ్యూలు వాయిదా పడుతున్నాయి. వీసా స్టాంపింగ్ కోసం వెళ్లిన అనేక మంది భారతీయులు అమెరికాకు తిరిగి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నారు.

# అక్రమంగా కృష్ణా నీటిని తరలిస్తున్న ఆంధ్రా

**చోద్యం చూస్తున్న సిఎం రేవంత్ రెడ్డి**

**బాబుకు గురు దక్షిణ సమర్పిస్తున్నట్లుగా ఉంది**

**మాజీమంత్రి హరీష్ రావు తీవ్ర ఆరోపణలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

కృష్ణా నదీ జలాలను ఏపీ అప్పనంగా తీసుకుపోతున్నదని..సీఎం రేవంత్ రెడ్డి మాత్రం జూబ్లీహిల్స్ ప్యాలెస్‌లో కూర్చొని చోద్యం చూస్తున్నాడని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే హరీష్ రావు ఆరోపించారు. తాను పూర్తి ఆధారాలతో మాట్లాడుతున్నానని తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో హరీష్ రావు అన్నారు. ఏపీ ఇష్టారాజ్యంగా కృష్ణా నీళ్లను తీసుకుపోతున్నది. తెలంగాణ ఇరిగేషన్ శాఖ కేఆర్ఎంబీకి రాసిన లేఖ ఇది. దీని ప్రకారం 664 టిఎంసీలు అంటే 80శాతం నీళ్లు ఏపీ వాడుకున్నది. ఇంతగా ఏపీ వినియోగిస్తుంటే ముఖ్యమంత్రి, నీళ్ల మంత్రి ఏం చేస్తున్నడని హరీష్ రావు ప్రశ్నించారు. 28 జనవరి నాడు తాత్కాలిక ఒప్పందం 66:34 ప్రకారం దాటి ఏపీ ఇప్పటికే 664 టీఎంసీలు వాడుకున్నదని హరీష్ రావు తెలిపారు. ఇంకా రెండు రోజుల్లో ఏపీ వినియోగం వాటా దాటుతుంది అని కేఆర్ఎంబీకి లేఖ రాసింది.వెంటనే బోర్డు మీటింగ్ పెట్టండి, ఏపీ నీటి దోపిడిని ఆపండి అని ఈఎన్‌సీ రాసిన లేఖలో ఉంది. 28న లేఖ రాసిండు, 31న ఈఎన్‌సీ రిటైర్ అయ్యారు.ఈఎన్‌సీ రిటైర్ అయిన తర్వాత వారం రోజుల దాకా పోస్టు నింపలేదు.లెక్కకు మించి నీళ్లు తీసుకుపోతుంటే మనకు ఈఎన్‌సీ పోస్టు నింపలేదు.వారం రోజుల తర్వాత మీడియా ప్రశ్నిస్తే పోస్టు నింపింది.బోర్డు మెంబర్ ఆయన. ఖాళీ పోస్టు ఎందుకు పెట్టారు.వాటా కుదరలేదా..? మాట కుదరలేదా.. ? వారం రోజులు ఎందుకు ఖాళీగా ఉంచారు.. రాష్ట్ర ప్రయోజనాలు ఈ ప్రభుత్వానికి పట్టదా.. ? అని హరీష్ రావు ప్రశ్నించారు. రేవంత్‌కు గురువు గారు ఉన్నరని భయం. శ్రీశైలం, నాగార్జున సాగర్ నుంచి నీళ్లు తరలించుకుపోతుంటే ఈ ప్రభుత్వం కండ్లు మూసుకు ప్రవర్తిస్తున్నదని మండిపడ్డారు. వేసవి వస్తున్నది, తెలంగాణకు నీటి అవసరాలు ఉన్నయి. పంటలకు, పారిశ్రామిక అవసరాలు ఉన్నాయన్నారు. తెలంగాణ అవసరాలు పట్టించుకునే బాధ్యత ఈ ప్రభుత్వానికి లేదా..? తాత్కాలికంగా అయినా మనం 34శాతం వినియోగించుకోవాలి కానీ వినియోగించుకున్నది 20 శాతం



వాటా. మన రాష్ట్రానికి 174 టీఎంసీలు వాడుకునేది ఉన్నది. అయినా వినియోగించుకోరు. ఈ రోజుకు కూడా ఏపీ 1.5 టీఎంసీల నీళ్లు తీసుకుపోతున్నది. మన పంటలు ఏం కావాలె. మహబూబ్ నగర్, నల్లగొండ, రంగారెడ్డి జిల్లాల్లో పంటల పరిస్థితి ఏం కావాలి. సర్కారు నడుపుతున్నరా..? సర్కస్ నడుపుతున్నరా..? అని ధ్వజమెత్తారు. అడగాల్సిన రేవంత్ రెడ్డి అడగడు, హక్కులు కాపాడాల్సిన కేఆర్ఎంబీ ఏపీని ప్రశ్నించదు. బీజేపీ ప్రభుత్వం చేతిలో కేఆర్ఎంబీ ఉన్నది. రాష్ట్రంలో ఉన్న ఇద్దరు కేంద్ర మంత్రులు కిషన్ రెడ్డి, బండి సంజయ్ కేసీఆర్ మీద పడి ఏడ్వడం తప్పిదే..నీళ్ల విషయంలో తెలంగాణకు జరుగుతున్న అన్యాయం గురించి ఎందుకు మాట్లాడరు..? కేఆర్ఎంబీని ఎందుకు నిలదీయరన్నారు. అడ్డగోలుగా ఏపీకి నీళ్లు తరలిస్తూ తెలంగాణ రైతుల నోళ్లు కొడుతున్నరు. బీజేపీ, కాంగ్రెస్ మధ్య ఉన్న బంధం ఏమిటి..? రేవంత్, కిషన్ రెడ్డి కలిసి తెలంగాణ గొంతు పిసుకుతారా..? చంద్రబాబు, రేవంత్ మధ్య ఫెవికాల్ బంధం ఉండొచ్చు కానీ రాష్ట్ర హక్కులను ఆంధ్రాకు ఎందుకు రాసిస్తున్నరని ప్రశ్నించిన హరీష్ రావు. బీజేపీ, కాంగ్రెస్ ఉద్దేశ్యపూర్వక నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు.

## నా పేరును మార్చడానికి

# మీరెవరు?

మొదటి పేజీ తరువాయి...



లేదని అన్నారు. కానీ మా తల్లి పెట్టిన పేరును మార్చడానికి మీరెవరని ప్రశ్నించారు. వ్యక్తిగత విమర్శలు సరికాదని హితవు పలికారు. మజ్లిస్ పార్టీతో కలిసి ముందుకు సాగినన్ని రోజులు మేం నిలదీస్తూనే ఉంటామని అన్నారు. తెలంగాణలో అన్ని స్థానాల్లో మజ్లిస్ పార్టీ ఎందుకు పోటీ చేయడం లేదని ప్రశ్నించారు.

కేసీఆర్‌ను అరెస్టు చేయాలంటూ మాకు చెప్పడమేమిటని ప్రశ్నించారు. కేసీఆర్‌ను రేవంత్ రెడ్డి ప్రభుత్వం అరెస్టు చేస్తే ఎవరూ అడ్డురాకుండా తాను చూసుకుంటానని అన్నారు. కేసీఆర్‌పై చర్యలు తీసుకోవాల్సిన బాధ్యత రేవంత్ రెడ్డిదా? లేక కిషన్ రెడ్డిదా? తెలంగాణ ప్రజలు ఆలోచించాలని విజ్ఞప్తి చేశారు. సోనియా గాంధీ, రాహుల్, ప్రియాంకలు ఒక్కసారైనా కేసీఆర్‌కు వ్యతిరేకంగా మాట్లాడారా అని ప్రశ్నించారు.

బీజేపీ ఎప్పుడూ బీఆర్ఎస్ పార్టీతో కలవలేదని స్పష్టం చేశారు. గతంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు కలిసి ఎన్నికల్లో పోటీ చేశాయని గుర్తు చేశారు. మున్సిపల్ ఎన్నికల్లో బీజేపీ గెలుపు ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఇచ్చిన హామీలను రెండేళ్లు పూర్తయినా అమలు చేయలేదని విమర్శించారు. మక్తల్ బీజేపీ అభ్యర్థి మహదేవప్ప మృతికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బాధ్యత వహించాలని అన్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు అన్ని ఏర్పాట్లు చేశాం

మొదటి పేజీ తరువాయి...

ఈ కేసులో ఆధారాలను 2021లోనే కోర్టుకు సమర్పించినట్లు తెలిపారు. ఫోన్ ట్యాపింగ్ కేసులోనూ అన్నీ పరిశీలించాకే నివేదికలు ఇచ్చామని అన్నారు. తెలంగాణలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నేపథ్యంలో ఆయన మీడియా సమావేశం నిర్వహించారు. పోలింగ్ కేంద్రాల్లో 100 శాతం వెబ్ కాస్టింగ్ ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ఓటర్లు స్వేచ్ఛగా తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల పోలింగ్‌కు అన్ని ఏర్పాట్లు చేశామని, హైదరాబాద్ మినహా రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల కోడ్ అమల్లో ఉందని డీజీపీ వెల్లడించారు.

బందోబస్తు కోసం ఇతర శాఖల నుంచి మూడు వేల అదనపు బలగాలను రప్పించామని అన్నారు. ఎన్నికల నేపథ్యంలో ఇప్పటి వరకు 1,183 లైసెన్స్ ఆయుధాలను స్వాధీనం చేసుకున్నామని... 4,318 మందిని బైండోవర్ చేశామని, 398 మందికి నాన్-బెయిల్ వారెంట్లు జారీ చేశామని వెల్లడించారు. నాలుగు రాష్ట్రాల సరిహద్దుల్లో 20 చెక్ పోస్టులను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రాష్ట్రంలో 55 చెక్ పోస్టులు ఉన్నాయని అన్నారు.

ఇప్పటి వరకు రూ.3.09 కోట్ల నగదును స్వాధీనం చేసుకున్నామని డీజీపీ తెలిపారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనకు సంబంధించి 142 కేసులు నమోదు చేశామని అన్నారు. 181 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను సిద్ధం చేశామని అన్నారు. మక్తల్‌లో బీజేపీ అభ్యర్థి మహదేవప్ప ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులకు ఫిర్యాదు అందిందని, కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు చేస్తున్నామని అన్నారు.

## మున్సిపల్ ఎన్నికల వేళ.. మక్తల్‌లో

# భాజపా అభ్యర్థి ఆత్మహత్య

మొదటి పేజీ తరువాయి...

పోటీ చేస్తున్నారు. మంగళవారం తెల్లవారుజామున ఆయన ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డారు. సోషల్ మీడియాలో ప్రత్యర్థుల వేధింపులతోనే మహదేవప్ప బలవన్మరణానికి పాల్పడినట్లు ఆయన భార్య సత్తెమ్మ ఆరోపిస్తున్నారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేపట్టారు.

**ఆరో వార్డు ఎన్నిక రద్దు**

మక్తల్ మున్సిపాలిటీలో ఆరో వార్డు ఎన్నికను తాత్కాలికంగా రద్దు చేస్తున్నట్లు ఎన్నికల అధికారి ప్రకటించారు. భాజపా అభ్యర్థి మహదేవప్ప మృతి నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు.

# స్పీకర్ ఓంబిర్లాపై అవిశ్వాసం

మొదటి పేజీ తరువాయి...



ఇచ్చేందుకు టీఎంసీ నిరాకరించింది. సభలో తాము మాట్లాడేందుకు స్పీకర్ ఓం బిర్లా అనుమతించడం లేదంటూ విపక్షాలు ఆరోపిస్తున్నాయి. తాజా బడ్జెట్ సమావేశాల సందర్భంగా 8 మంది ప్రతిపక్ష పార్టీల ఎంపీలపై సస్పెన్షన్ వేటు పడింది. భారత్-చైనా ఉద్రిక్తతలకు సంబంధించి ఆర్మీ మాజీ చీఫ్ నరవణె అముద్రిత పుస్తకంలోని అంశాలపై కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ చర్చకు పట్టుబట్టిన నేపథ్యంలో ఎంపీలు నిరసనలకు దిగి సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ నేపథ్యంలోనే స్పీకర్ తీరుపై ఆగ్రహానికి గురైన కాంగ్రెస్ అవిశ్వాస తీర్మానానికి పూనుకుంది. సాధారణంగా అవిశ్వాస తీర్మానం ప్రవేశపెట్టాలంటే 14 రోజుల ముందుగా నోటీసులు ఇవ్వాలి. ఆ ప్రకారం బ్జడెట్ రెండో విడత సమావేశాల్లో అవిశ్వాస తీర్మనం సభలో చర్చకు వచ్చే అవకాశం ఉంటుంది. బ్జడెట్ తొలి విడత సమావేశాలు జనవరి 28న ప్రారంభమై ఫిబ్రవరి 13న ముగియనున్నాయి. రెండో విడత సమావేశాలు మార్చి 9న ప్రారంభమై ఏప్రిల్ 2వ తేదీ వరకు కొనసాగనున్నాయి.

# బిఆర్ఎస్ అభ్యర్థులను బంపర్ మెజారిటీతో గెలిపించాలి


**మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్**

**కాంగ్రెస్ పార్టీ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో విఫలం.**

**మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెప్పాలి**

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం)**

ప్రజలు బిఆర్ఎస్ నాయకత్వం పట్ల విశ్వాసంగా ఉన్నారని,మున్సిపల్ ఎన్నికల్లో బీఆర్ఎస్పార్టీ సత్తా చాటడం ఖాయమని మైలార్ దేవ్ పల్లి డివిజన్ బీఆర్ఎస్ పార్టీ అధ్యక్షులు ఎస్.వెంకటేష్ అన్నారు.ఎన్నికల ప్రచారంలో ఎటు చూసినా ప్రజలు బీఆర్ఎస్ పార్టీకి ఓటు వేసి గెలిపిస్తామని సంతోషంగా తెలుపడం జరిగిందన్నారు.తిరిగి కేసీఆర్ నాయకత్వంలోనే రాష్ట్రం అభివృద్ధిలో ముందుకు సాగనుందని వివరించారు.బుధవారం జరిగే ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించి కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ అభ్యర్థులను మరి మెజారిటీతో గెలిపించాలని ఆయన కోరారు.ఈ మేరకు ఆయన మాట్లాడుతూ...అబద్ధపు హామీలతో ప్రజలను వంచించి గద్దెను ఎక్కిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థులను మున్సిపల్ ఎన్నికల్లో చిత్తుగా ఓడించాలని కోరారు.రేవంత్ పాలనలో కేసీఆర్ అమలు చేసిన పథకాలన్నీ బంద్ అయ్యాయని విమర్శించారు.ప్రజలు కాంగ్రెస్ మాయలో పడొద్దని,మరోసారి నమ్మితే గోసపడతారని అన్నారు.రెండున్నరేళ్లలో ప్రజా సంక్షేమానికి తూట్లు పొడవడం తప్ప రేవంత్ సర్కార్ చేసిందేమీ లేదని విమర్శించారు.భార్యకు బస్సు ఫ్రీ ఇచ్చి,భర్తకు డబుల్ టికెట్





ఇచ్చాడని అన్నారు.ఏం మంచి పని చేశారని కాంగ్రెస్ నాయకులు ఓట్లు వేయమని అడుగుతారని ప్రశ్నించారు.రేవంత్ నోటి వెంట బూతులు తప్ప మంచిమాటలు రావడం లేదని మండిపడ్డారు.రూ.4వేల పింఛన్ ఇవ్వలేదని,ఒక్కొక్కరికీ రూ.52 వేలు బాకీ పడ్డారని అన్నారు.అవ్వాతాతలకు ఇవ్వాల్సిన బాకీ డబ్బులు రూ.52 వేలు ఇవ్వాలని నిలదీయాలని సూచించారు.బీఆర్ఎస్ హయాంలో బిడ్డ పుడితే రూ.13 వేలు ఇచ్చి అంబులెన్స్లో జాగ్రత్తగా ఇళ్ల వద్ద దించామని పేర్కొన్నారు.కల్యాణలక్ష్మీ కింద ఆడబిడ్డల పెళ్లి రూ.లక్ష ఇచ్చామని పేర్కొన్నారు.రేవంత్ రెడ్డి తులం బంగారం ఇస్తానని చెప్పిండని,ఇంతవరకూ ఇచ్చిండా అని ప్రశ్నించారు.ఏ ఒక్కరికైనా తులం బంగారం వచ్చిందా అని నిలదీశారు.మోసం చేసిన కాంగ్రెస్కు ఓట్లు వేసి గోసపడదామా అని ప్రశ్నించారు.ఈ కాంగ్రెస్ ప్రభుత్వంలో గొర్రె పిల్లల పథకం,చేప పిల్లల పథకం బంద్ అయ్యిందని చెప్పారు.కేసీఆర్ కిట్ బంద్..ఫీజు రీయింబర్స్మెంట్ బంద్ అయ్యిందని అన్నారు.కేసీఆర్ పథకాలన్నింటినీ సీఎం రేవంత్ రెడ్డి బంద్ పెడుతున్నాడని తెలిపారు.అన్ని పథకాలు బంద్ పెట్టి గోసపెడుతున్న రేవంత్కు ఓట్లేద్దామా అని ప్రశ్నించారు.కాంగ్రెసోళ్లు బట్టేబాజ్ మాటలు మాట్లాడుతుండ్రు అని మండిపడ్డారు.బీఆర్ఎస్ అధికారంలోకి వచ్చాక స్పెషల్ ప్యాకేజీ తెచ్చి అన్ని విధాల అభివృద్ధి చేస్తామని హామీ ఇచ్చారు.కేసీఆర్ హయాంలో మున్సిపాలిటీలకు నిధులు ఇచ్చి అభివృద్ధి చేశారని గుర్తుచేశారు.బస్తీ దవాఖానాలు,వీధిలైట్లు,రోడ్లు,పార్కులు ఏర్పాటు చేశామని తెలిపారు.ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మాత్రం లాగుల తొండలు వదులుతా..పేగులు తీసి మెడలో వేసుకుంట..గుడ్లు పీకి గోటీలాడుతా అని అంటున్నారన్నారు.ఇలాంటి భాషనా ఓ ముఖ్యమంత్రి మాట్లాడేదని వెంకటేష్ మండిపడ్డారు.బీసీ,ఎస్సీ,ఎస్టీలు, విద్యార్థులు,ఉద్యోగులు,మహిళలను మోసం చేసిందని మాట్లాడారు.ఏ ఒక్కరినీ వదలకుండా అన్ని వర్గాలనూ మోసం చేసిందని మండిపడ్డారు.డిక్లరేషన్లు మరిచిపోయిండని..బూతుల డిక్లరేషన్లు చేసిండని తెలిపారు.ఈ బూతుల ముఖ్యమంత్రిని ఓటుతో గట్టి బుద్ధి చెప్పాలని సూచించారు.చెత్త మాటలు వద్దు..అభివృద్ధి కావాలంటూ ఓటుతో తెలియజెప్పాలన్నారు.11న జరగనున్న మున్సిపల్ ఎన్నికల్లో కారు గుర్తుకు ఓటు వేసి బీఆర్ఎస్ పార్టీ బలపర్చిన అభ్యర్థులను భారీ బంపర్ మెజారిటీతో గెలిపించాలని రాష్ట్ర ప్రజలను అభ్యర్థించారు.



## మున్సిపల్ ఎన్నికల్లో ఓటమి భయంతోనే అధికార పార్టీ బిజెపి నాయకులను భయభ్రాంతులకు గురిచేస్తోంది

**రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్**

**రాజేంద్రనగర్,ఫిబ్రవరి10(ప్రభాత ఉదయం)**

భారతీయ జనతా పార్టీ నాయకులు,ప్రజా ప్రతినిధులను బెదిరింపులకు గురి చేయాలనుకోవడం సిగ్గు చేటని రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షులు సందీప్ ముదిరాజ్ అన్నారు.అధికార పార్టీ మదంతో భారతీయ జనతా పార్టీ నాయకులను బెదిరింపులకు పాల్పడుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు.మంగళవారం సందీప్ ముదిరాజ్ ఆధ్వర్యంలో నారాయణపేట జిల్లామక్తల్ మున్సిపాలిటీ పరిధిలోని 6వార్డు బీజేపీ అభ్యర్థి ఎరుకలి మహదేవ్ అధికార పార్టీ బెదిరింపులకి మృతి చెందడంతో డీజీపీ కార్యాలయం ముట్టడి కార్యక్రమాన్ని నిర్వహించారు.రాజేంద్రనగర్ డివిజన్ నాయకులను అరెస్టు చేసి సైబరాబాద్ పోలీసు స్టేషన్ కు తరలించారు.ఈ సందర్భంగా సందీప్ ముదిరాజ్ మాట్లాడుతూ...కాంగ్రెస్ పాలకులు బీజేపీ పార్టీ నాయకులను బెదిరింపులకు గురి చేస్తూ ప్రాణాల మీదకు తీసుకువస్తున్నారన్నారు.ఇలాంటి నీచ రాజకీయాలు కేవలం కాంగ్రెస్ పార్టీకే సాధ్యమవుతాయని ఎద్దేవా చేశారు.డీజీపీ కార్యాలయాన్ని ముట్టడి చేసేందుకువెళ్తున్న తమను అడ్డుకొని అరెస్టులు చేయడం ఏంటని ప్రశ్నించారు.ఈ కార్యక్రమంలో హరికిషన్ జి,సోల్కర్ రెడ్డి,బండారు బాలకృష్ణ,జనరల్ సెక్రటరీ రాజశేఖర్ రెడ్డి,విజయ్ యాదవ్,అల్లి శివ,నాయకులు పాల్గొన్నారు.

## సీడబ్ల్యుఎఫ్ఐ జాతీయ ఉపాధ్యక్షులుగా సుంకర రామ్మోహన్ రావు

**బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**



కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (సీడబ్ల్యుఎఫ్ఐ) జాతీయ ఉపాధ్యక్షులుగా రాజేంద్రనగర్ సర్కిల్ బుద్వేల్ శ్రీ శివసాయి కాలనీ కి చెందిన సుంకర రామ్మోహన్ రావు నియమితులైనారు. ఈ నెల 6,7,8 తేదీలలో రాజస్థాన్ శిఖర్ జిల్లాలో జరిగిన కన్స్ట్రక్షన్స్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా 11వ జాతీయ మహా సభలలో సుంకర రామ్మోహన్ రావు ను తెలం గాణ రాష్ట్రం నుంచి జాతీయ ఉపాధ్యక్షునిగా నియమించారు. సీఐటీయు అనుభంద యూనియన్ క్రింద ఈ సంఘం భవన నిర్మాణ రంగ కార్మికుల సంక్షేమం కోసం పనిచేస్తుంది. సీడబ్ల్యుఎఫ్ఐ కు జాతీయ అధ్యక్షునిగా ఎం సాయిబాబు ను నియమించగా కార్యదర్శిగా హైదరాబాద్ కు చెందిన వంగూరు రాములు ను నియమించారు.

**ఈ నెల 12న చేపట్టనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయాలి: సుంకర రామ్మోహన్ రావు**

నాలుగు లేబర్ కోడ్లు, వీ.బీ. రామ్ జీ చట్టం, జాతీయ విత్తన, విద్యుత్ సవరణ బిల్లుల ను రద్దు చేయాలని డిమాండ్ చేస్తు, 1996 కేంద్ర చట్టం ను అమలు చేయాలని కోరుతు ఈ నెల 12న నిర్వహిం చనున్న దేశ వ్యాప్త సమ్మెను విజయవంతం చేయడానికి కార్మిక లోకం కలసి రావాలని కన్స్ట్రక్షన్ వర్కర్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా జాతీయ ఉపాధ్యక్షులు సుంకర రామ్మోహన్ రావు కోరారు. కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం ప్రజలు, కార్మికుల హక్కులను కాలరాయడమే కాకుండ రాష్ట్ర హక్కులను హరిస్తు చట్టాలను చేసిందన్నారు. అత్యంత ప్రమాదకరమైన నాలుగు లేబర్ కోడ్ల అమలు, విద్యుత్ సవరణ బిల్లు-2025, విత్తన బిల్లు, వీబీజీ రామ్ జీ చట్టం, భీమా రంగంలోకి 100శాతం విదేశీ పెట్టుబడులకు అనుమతి, అణురంగంలోకి ప్రైవేటు కంపెనీలకు అనుమతిస్తు అణుచట్టం చేయడం బాధాకరమన్నారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 29 చట్టాలతో పాటు, భవన నిర్మాణ కార్మికులు 1996 కేంద్ర చట్టం, 1979 అం తర్రాష్ట్ర వలస కార్మికుల చట్టాలను రద్దు చేశారన్నారు. వీటికి వ్యతిరేకంగా కేంద్ర కార్మిక సంఘాలు, రైతు వ్యవసాయ కార్మిక సంఘాలు ఈ నెల 12న దేశ వ్యాప్త సమ్మెకు పిలుపునిచ్చాయన్నారు. సమ్మెలో భవన. ఇతర నిర్మాణ కార్మికులంత పాల్గొని జయప్రదం చేయాలని సుంకర రామ్మోహన్ రావు కోరారు.

## ద్విచక్ర వాహనం ఢీకొని వ్యక్తి మృతి..

**బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) ;**



సురేందర్

ద్విచక్ర వాహనం ఢీకొని గాయపడిన ఓ వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందిన ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగింది.ఎస్సై సుమన్ తెలిపిన వివరాల మేరకు.. హైదర్ గూడలో నివాసం ఉండే సురేందర్ (46)క్యాటరింగ్ బాయ్ గా పనిచేస్తున్నాడు.ఈనెల తొమ్మిదో తేదీన బేగంబజార్ లో జరిగిన ఓశుభకార్యానికి వెళ్లిన సురేందర్ పనులు ముగించుకొని తిరిగి ఇంటికి వస్తున్నాడు.హైదర్ గూడ పిల్లర్ నెంబర్ 153వద్ద రోడ్డు దాటుతుండగా ద్విచక్ర వాహనం అతివేగంగా వచ్చి సురేందర్ ను ఢీకొట్టింది.దీంతో సురేందర్ తలకు తీవ్ర గాయాలయ్యాయి.స్థానికుల సమాచారం మేరకు ఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు సురేందర్ ను చికిత్స నిమిత్తం ఉస్మానియాకు తరలించారు.చికిత్స పొందుతూ సురేందర్ పదో తేదీ ఉదయం మృతి చెందాడు.సురేందర్ కుమారుడు రోహిత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## ఓ వ్యక్తిని కత్తితో గాయపరిచిన యువకుడిని రిమాండ్కు తరలించిన పోలీసులు

**బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) :**

మైలార్ దేవ్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో కత్తి పోట్ల కలకలం రేపుతోంది. ఏఎస్ఐ అబ్దుల్లా తెలిపిన వివరాల ప్రకారం.. మహమ్మదీయ మజీద్ వద్ద నివాసముండే మహమ్మద్ ఉమర్ (22), అదే కాలనీలో నివాసం ఉండే మహమ్మద్ ఉమర్ (38) తో సోమవారం రాత్రి చిన్న గొడవ జరిగింది. గొడవ కారణంగా కోపం పెంచుకున్న యువకుడు ఉమర్ పై వెనకనుంచి కత్తితో దాడి చేశాడు. దాడిని అడ్డుకునేందుకు ప్రయత్నించిన మరో వ్యక్తిని సైతం గాయాలయ్యాయి. వెంటనే స్పందించిన స్థానికులు చికిత్స నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. మహమ్మద్ ఉమర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసిన మైలార్ దేవ్ పల్లి పోలీసులు ఉమర్ ను అరెస్టు చేసి కత్తిని స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.



హనుమాన్ నగర్ బస్తీ ప్రజల తో కలిసి ఎమ్మెల్యే టి ప్రకాష్ గౌడ్ కు వినతి పత్రం అందచేస్తున్న క్రైస్తవ సంఘాల ప్రతినిదులు

## హనుమాన్ నగర్లో క్రైస్తవులు ప్రార్ధనలు చేసుకోవడానికి అవకాశాలు కల్పించాలి

**క్రైస్తవ సంఘాల నాయకులు**

**బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

రాజేంద్రనగర్ హనుమాన న్గర్ లో క్రైస్తవులు ప్రార్థనలు చేసుకునేలా అవకాశాలు కల్పించాలని కోరుతు మంగళవారం చర్చి సభ్యులు, క్రైస్తవ సంఘాల నాయకులు, పాస్టర్స్ ఫెలోషిప్ ప్రతినిధులు రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ ను మైలార్దే వుపల్లిలోని ఆయన నివాసంలో కలసి విజ్ఞప్తి చేశారు. వది సంవత్సరాల నుంచి హనుమాన్ నగర్ లో గుడిసె లో చర్చి ఉందన్నారు. దాన్ని ఇటీవల ఇటుకలతో నిర్మించుకుంటుటే రాజేం ద్రనగర్ తహసీల్దార్ బి రాములు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి సోమవారం ఎస్కవలేటర్ తో కూల్చివేశారన్నారు. కూల్చివేసిన స్థలం చర్చి స్థలం అని, ఎవరికి నివాసం కాదని, అక్కడ చర్చి ఉండేలా సహకారం అందజేయాలన్నారు. రెవెన్యూ అధికారులతో మాట్లాడి ప్రార్థనలు చేసుకోవడానికి అనుమతి ఇప్పించాలన్నారు. దానికి స్పందించిన ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్ హనుమాన్ నగర్ లో చర్చి కొనసాగడానికి రెవెన్యూ ఉన్నతాధికారులతో మాట్లాడుతానని హామీ ఇచ్చారు. ముందు ఉన్న స్థలంలోనే కట్టుకుంటే బాగు ండేదని, అదనపు స్థలంలో నిర్మించినట్లు తెలిసిందన్నారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో క్రైస్తవ సంఘాల ప్రతినిధులు సాయిలు, రెవరెండ్ డాక్టర్ జీఎస్ విజయభూషణం, మాజీ కౌన్సిలర్ కె ఎస్ దయానంద్, నాయకులు పలుగుచెరువు మహేశ్, రగడంపల్లి శ్రావణ్, అనుముల జాన్ పాల్ , పాస్టర్స్ ఫెలోషిప్ గవర్నింగ్ బాడీ సభ్యులు రెవరెండ్ పి. స్వర్ణకుమార్, అధ్యక్షులు రెవరెండ్ కె సుందర్ పాల్ , ఉపాధ్యక్షులు రెవరెండ్ సీహెచ్ సునీల్ సామ్యూల్, రెవరెండ్ జాన్ వెస్లీ , మహేశ్వరం నియోజకవర్గం పాస్టర్స్ ఫెలోషిప్ నాయకులు రెవరెండ్ గిడ్యోన్, రెవరెండ్ కుమార్ నాయక్, బ్రదర్ గుంటి సురేశ్, హనుమాన్ నగర్ కు చెందిన దశరథ్ తదితరులున్నారు.




తన జన్మదినం సందర్భంగా నైట్ సెంటర్లు పేదలకు భోజనం వడ్డిస్తున్న సదాలక్ష్మి

## ఘనంగా గ్రేస్ స్వచ్ఛంద సంస్థ అధ్యక్షురాలు, టిపిసిసి ప్రధాన కార్యదర్శి ఏ సదా లక్ష్మీ జన్మదిన వేడుకలు

రాజేంద్రనగర్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) గ్రేస్ స్వచంద సంస్థ అధ్యక్షరాలు, తెలంగాణ కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి కుమారి అద్దేశి సదాలక్ష్మి జన్మదిన వేడుకలు శివరాంపల్లిలో గల నైట్ షెల్టర్ లో ఘనంగా జరిగాయి. నైట్ సెంటర్ లో గ్రేస్ స్వచ్ఛంద సంస్థ సభ్యులు , బాల కార్మిక పునర్వాస విద్యార్థులు, టీచర్స్, గ్రేస్ పూర్వ సిబ్బంది సన్మానించారు. పూర్వ విద్యార్థులు మాట్లాడుతూ ఇక్కడ సంస్థ విద్యార్థులుగా ఉండి ఎంతో ఉన్నత శిఖరాలను అందుకొని మీ ముందుకు రావడం ఎంతో గర్వంగా ఉంది అంటూ మాట్లాడారు. విద్యార్థులు ఇంకా ఆర్థికంగా బలపడి అనేక సామాజిక కార్యక్రమాలు చేపట్టాలని సదాలక్ష్మి ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వెంకటేష్, మరియమ్మ, ప్రవళిక, వినోద్,శ్రీనివాస్ రెడ్డి, సంతే, , బాలరాజా, బాషా, నవీన్ , శ్రీకాంత్, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



సదాలక్ష్మి ని సన్మానిస్తున్న ప్రజలు

# మారుతి సుజుకి కారు సర్వీసింగ్ సెంటర్లో అగ్నిప్రమాదం.. మూడు వాహనాలు దగ్ధం

**బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) :**

ఉప్పరపల్లిలోని మారుతి సుజుకి కారు సర్వీసింగ్ సెంటర్లో మంగళవారం తెల్లవారుజామున అగ్నిప్రమాదం జరిగింది.ఈ ఘటన రాజేంద్రనగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది.సర్వీసింగ్ సెంటర్ లో మంటలు చేలరేగి మూడు కార్లు దగ్ధమయ్యాయి. అధికారులు,స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ఉప్పర్ పల్లి 185 పిల్లర్ నెంబర్ వద్ద అన్న మారుతి సుజుకి కారు సర్వీసింగ్ సెంటర్లో తెల్లవారుజామున ఒక్కసారిగా మంటలు చెలరేగాయి.పరిసర ప్రాంతాల్లో మంటలు వ్యాపించడంతో,వెంటనే హ్యాపీ హోమ్స్ అపార్ట్మెంట్ వాసులు ప్రమాదాన్ని గుర్తించి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు.సంఘటనా స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది రెండు ఫైరింజన్ల సహాయంతో మంటలను పూర్తిగా అదుపులోకి తెచ్చారు.ప్రమాద సమయంలో సర్వీసింగ్ సెంటర్లో సుమారు 50కి పైగా వాహనాలు ఉన్నాయి.ఈ ప్రమాదంలో మూడు కార్లు దగ్ధం అయ్యాయని, ప్రమాదం జరిగిన సమయంలో సర్వీస్ సెంటర్ లో ఎవరు లేకపోవడంతో ప్రాణాపాయం తప్పింది.ఫైర్ సిబ్బంది





సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది.ఈ ప్రమాదం షోరూం వెనక భాగంలో స్క్రాప్ గోదాంలో నిల్వ ఉంచిన ప్లాస్టిక్ వ్యర్థాలతో ప్రమాదం జరిగినట్లు అధికారులు ప్రాథమిక అంచనాకు వచ్చారు.షోరూం నిర్వాహకుల నిర్లక్ష్యం వల్లే అగ్నిప్రమాదం జరిగిందని స్థానికులు ఆరోపించారు.అయితే ఉద్దేశ్యపూర్వకంగానే ఎవరో నిప్పంటించారని షోరూం నిర్వాహకులు చెబుతున్నారు.కేసునమోదు చేసుకున్న పోలీసులు సీసీటీవీ ఫుటేజ్ ద్వారా ఘటన ఎలా జరిగింది.ఉద్దేశపూర్వకంగా ఎవరైనా చేశారా అనే కోణంలో దర్యాప్తు చేస్తున్నారు.

# మున్సిపల్ ఎన్నికలకు సర్వం సిద్ధం

**ఎన్నికల సజావుగా జరుగుటకు ప్రజలు సహకరించాలి..**

**ఉదయం 7.00 నుండి సాయంత్రం 5.00 గంటల వరకు ఎన్నికలు**

**ఏదేని ప్రభుత్వ గుర్తింపు కార్డుతో పోలింగ్ బూతుకు రావాలి**

**ప్రతి ఒక్కరు తమ ఓటు హక్కును వినియోగించుకోవాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్**



పోలింగ్ సామాగ్రితో బయలుదేరిన సిబ్బంది

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం):**



జనగామ జిల్లా లో మున్సిపల్ ఎన్నికల నిర్వహణకు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశామని, ఓటర్లు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని జిల్లా ఎన్నికల అధికారి, జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సజావుగా, నిష్పక్షపాతంగా, పారదర్శకంగా నిర్వహించుటకు అన్ని ఏర్పాటు పూర్తి చేశామని, జిల్లాలో జనగామ, స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో ఉదయం 7.00 గంటల నుండి పోలింగ్ ప్రారంభం అయి సాయంత్రం 5.00 గంటలకు ముగుస్తుందని తెలిపారు.అలాగే జనగామ మున్సిపాలిలో 30 వార్డులు, గాను 66 పోలింగ్ స్టేషన్లు ఏర్పాటు తో పాటు స్టేషన్ ఘన్‌పూర్ లో 18 వార్డులకు 36 పోలింగ్ స్టేషన్లను ఏర్పాటు చేశామని అన్నారు. అలాగే జిల్లాలో నేడు జరుగనున్న మున్సిపల్ ఎన్నికల్లో మొత్తం 62 వేల 595 ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారని, ఇందులో జనగామ మొత్తం 44,045 ఓటర్ల లో పురుషులు 21,358, స్త్రీలు 22,678 ఓటర్లు, ఇతరులు 9 మంది ఓటర్లు ఉన్నారని అలాగే స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపాలిటీలో మొత్తం 18,550 మంది ఓటర్లకు పురుషులు 8,913 మంది స్త్రీలు 9,636 మంది అలాగే ఇతరులు ఒక్కరు ఓట హక్కు కలిగి ఉన్నారని, వీరందరు తమ ఓటు హక్కును తప్పక వినియోగించుకోవాలని కలెక్టర్ కోరారు. జనగామ మున్సిపాలిటీలో 80 మంది ప్రిసైడింగ్ అధికారులు, 80 మంది సహాయ ప్రిసైడింగ్ అధికారులు, 240 ఇతర పోలింగ్ అధికారులు అలాగే స్టేషన్ ఘన్‌పూర్ మున్సిపల్‌లో 44మంది ప్రిసైడింగ్ , 44 మంది సహాయ ప్రిసైడింగ్ మరియు 132 మంది ఇతర పోలింగ్ అధికారులను నియమించామని కలెక్టర్ తెలిపారు. అలాగే జనగామ మున్సిపాలిటీలో 28 , స్టేషన్ ఘన్ పూర్ మున్సిపాలిటికి 9 మంది మైక్రో అబ్జర్వర్స్ను నియమించినట్లు తెలిపారు. ఎన్నికలు జరుగుతున్న నేపథ్యంలో.. ఎన్నికల నిబంధనలు ఉల్లంఘన జరుగకుండా ఇప్పటికే ఎఫ్ఎస్టి, ఎస్ఎస్టి, ఎంసీసీ బృందాలను ఏర్పాటు చేశామని తెలిపారు. అలాగే 9 మంది జోనల్ ఆఫీసర్స్ను, 9 మంది రూట్ అధికారులను నియమించామని తెలిపారు. జనగామ, స్టేషన్‌ఘన్‌పూర్ మున్సిపాలిటీల్లో ఒక్కొక్కరి వ్యయ (ఖర్చుల) పరిశీలకులను నియమించామని అన్నారు. నేడు ఎన్నికల జరుగనున్న సందర్భంగా పోలింగ్ బూతుల వద్ద ఏలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా బందోబస్తును ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల సజావుగా, పారదర్శకంగా , ప్రశాంత వాతావరణలో ఎన్నికలు జరుపుటకు ప్రజలు సహకరించాలన్నారు. ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు పోలింగ్ కేంద్రాలకు తరలి వచ్చే సమయంలో 18 రకాల గుర్తింపు కార్డులలో ఏదైనా ఒకటి అనగా ఓటర్ కార్డు, ఆధార్ కార్డు, ఉపాధి హామీ జాబ్ కార్డు, ఫోటో కూడిన పోస్టు ఆఫీసు కార్డు, బ్యాంక్ పాస్ బుక్, కార్మిక మంత్రిత్వ శాఖ ద్వారా జారీ చేసిన హెల్త్ ఇన్సూరెన్స్ స్మార్ట్ కార్డు, డ్రైవింగ్ లైసెన్స్, పాన్ కార్డు, లేబర్ గుర్తింపు కార్డు, ఇండియన్ పాస్ పోర్టు, ఫోటోతొ కూడిన పెన్షన్ డాక్యుమెంట్, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వంచే జారీ చేయబడిన ఉద్యోగ గుర్తింపు కార్డులు, దివ్యాంగుల గుర్తింపు కార్డు అలాగే ఎం.పి, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీలకు జారీ చేసిన అధికారిక గుర్తింపు కార్డులు తదితర వాటిలో ఏదైనా ఒక దానిని చూపించి ఓటు వేయవచ్చని కలెక్టర్ సూచించారు. ఓటర్లు ఓటు హక్కును 100 శాతం వినియోగించుకుని ప్రజాస్వామ్య పరిరక్షణకు తొడ్పాటును అందించాలన్నారు. స్టేషన్ ఘన్‌పూర్ కు 22మంది, జనగామ మున్సిపల్ కు 36 మంది కౌంటింగ్ సూపర్‌వైజర్స్ ను,అలాగే స్టేషన్ ఘన్ పూర్ కు 44 మంది , జనగామ మున్సిపల్ కు 72 కౌంటింగ్ అసిస్టెంట్లను నియమించామని తెలిపారు. అలాగే ప్రతి పోలింగ్ కేంద్రాల్లో ఎన్నికలు ప్రక్రియను పూర్తిగా వెబ్ కాస్టింగ్ చేపట్టినట్లు కలెక్టర్ తెలిపారు. ఈ నెల 13వ తేదిన ఓట్ల లెక్కింపు జరుతుందని, స్టేషన్ ఘన్పూర్‌లో తెలంగాణ సాంఘిక సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్ ( జూనియర్‌కాలేజ్), అలాగే జనగామలో ఏకశీల బీఈడి కాలేజ్, ఓట్ల లెక్కింపు జరుగుతుందని తెలిపారు.

# కార్మిక హక్కుల పరిరక్షణకు 12న సమ్మె

**కూకట్ పల్లి లో సిఐటియు కరపత్రలతో ప్రచారం.. స్వచ్ఛందంగా కదిలి రావాలని పిలుపు**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం)**



కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం కార్మిక, ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ తీసుకువచ్చిన నాలుగు లేబర్ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేస్తూ ఈ నెల 12న జరగనున్న జాతీయ సమ్మెను జయప్రదం చేయాలని పిలుపునిస్తూ మంగళవారం కూకట్ పల్లి సర్కిల్ పరిధిలోని మూసాపేట్, వై జంక్షన్, ప్రశాంతి నగర్ ప్రాంతాల్లో సిఐటియు ఆధ్వర్యంలో ఆశా వర్కర్లు కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సిఐటియు కార్యదర్శి సబియా మాట్లాడుతూ, నాలుగు లేబర్ కోడ్‌ల ద్వారా కార్మికుల హక్కులను హరించేందుకు కేంద్ర ప్రభుత్వం కుట్ర చేస్తోందని విమర్శించారు. ఈ కోడ్‌లు అమల్లోకి వస్తే ఉద్యోగ భద్రత పూర్తిగా నశించి, పని గంటలు పెరిగి, జీతాలు తగ్గే ప్రమాదం ఉందన్నారు. కార్మిక సంఘాల హక్కులు, సమ్మె చేసే స్వేచ్ఛను కూడా ఈ చట్టాల ద్వారా కాలరాస్తున్నారని ఆరోపించారు. ప్రత్యేకంగా ఆశా, అంగన్‌వాడీ, మిడ్‌డే మిల్ వర్కర్లు వంటి స్కీం వర్కర్లను కార్మికులుగా గుర్తించకుండా ప్రభుత్వం వివక్ష చూపుతోందని, కనీస వేతనం, సామాజిక భద్రత, పెన్షన్ వంటి హక్కులు కూడా ఇవ్వకుండా దోపిడీ చేస్తోందన్నారు. కార్మికుల ఐక్యతతోనే ఈ ప్రజా వ్యతిరేక విధానాలకు గట్టి సమాధానం ఇవ్వగలమని పేర్కొన్నారు. ఈ సమ్మెలో ఆశా వర్కర్లు పెద్ద సంఖ్యలో పాల్గొని ప్రభుత్వ విధానాలకు వ్యతిరేకంగా తమ నిరసన వ్యక్తం చేయాలని ఆమె పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు, ఆశా వర్కర్లు మౌనిక, రాణి, లలిత, అనురాధ, సోమలత తదితరులు పాల్గొన్నారు.

# పదవులు ఉన్నా లేకున్నా ప్రజలలో ఉండి పనిచేస్తాం

**ఐదు సంవత్సరాలు ఆదరించిన డివిజన్ ప్రజలకు కృతజ్ఞతలు**

**బుద్వేల్, ఫిబ్రవరి 10 10(ప్రభాత ఉదయం):**


కార్పొరేటర్ తోకల శ్రీనివాస్ రెడ్డి

ఐదు సంవత్సరాలు ఆదరించిన డివిజన్ ప్రజలందరికీ కృతజ్ఞతలు తెలుపుతున్నామని రాజేంద్రనగర్, అత్తాపూర్, మైలార్ దేవుపల్లి డివిజన్ల కార్పొరేటర్లు పి అర్చన జయప్రకాష్, ఎం సంగీత గౌరీ శంకర్, తోకల శ్రీనివాస్ రెడ్డి లు అన్నారు. పదవులు ఉన్నా... లేకపోయినా నిరంతరం ప్రజల్లో ఉండి పనిచేస్తామన్నారు. తమ తమ డివిజన్ లలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు.

**బుద్వేల్, శివరాంపల్లి బస్తీలలో అభివృద్ధి పనులకు కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాశ్ శంకుస్థాపన**



బుద్వేల్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం) : బుద్వేల్, గ్రీన్ సిటీ ప్రాంతాలలో రూ.75 లక్షలతో, శివరాంపల్లి శిశుమందిర్ ప్రాంతంలో రూ.49లక్షలతో చేపట్టనున్న అభివృద్ధి పనులకు మంగళవారం


బుద్వేల్ లో రోడ్డు పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ పి అర్చన జయప్రకాష్

రాజేంద్రనగర్ డివిజన్ కార్పొరేటర్ పి. అర్చన జయప్రకాశ్ శంకుస్థాపన చేసి పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, ఐదు సంవత్సరాల పాటు కార్పొరేటర్ గా రాజేంద్రనగర్ డివిజన్ లోని అన్ని బస్తీలు, కాలనీలలో కోట్లాది రూపాయలతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందన్నారు. తనను కార్పొరేటర్గా గెలిపించి ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలుపుతున్నానన్నారు. పదవి ఉన్నా లేకపోయినా నిరంతరం ప్రజల మధ్య ఉండి పనిచేస్తానన్నారు. బుద్వేల్ లో చాలా రోజులుగా రోడ్లు బాగులేక ప్రజలు ఇబ్బందులు పడ్డారని, రూ.75 లక్షలతో చేపట్టనున్న సీసీ రోడ్లతో చాలా వరకు సమస్యలు దూరమౌతాయన్నారు. స్థానిక ప్రజలు తమ ఇండ్ల ముందు జరిగే పనులు నాణ్యతగా చేపట్టే విదంగా పర్యవేక్షించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రజనీకాంత్ గౌడ్, బానాల నరేందర్, శ్రీనివాస్, ఆదిత్య, ఇద్రీస్, రాజు గౌడ్, సురేశ్, సూర్యప్రకాశ్ రెడ్డి, శివాజీ లు పాల్గొన్నారు.

**రూ.70 కోట్లతో రోడ్లను అభివృద్ధి చేసాను : కార్పొరేటర్ ఎం సంగీత గౌరీ శంకర్ :**



కార్పొరేటర్ గా ఐదు సంవత్సరాలలో అత్తాపూర్ డివిజన్ లో రూ.70కోట్లతో అభివృద్ధి పనులు చేపట్టడం జరిగిందని కార్పొరేటర్ మోంద్ర సంగీత గౌరీశంకర్ తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ, తనను కార్పొరేటర్ గా గెలిపించి ఐదు సంవత్సరాలు ఆదరించిన ప్రతి ఒక్కరికి ధన్యవాదాలు తెలియజేస్తున్నానన్నారు. చాలా వరకు పనులు పూర్తయ్యాయని, మరి కొన్ని పనులు ప్రస్తుతం జరుగుతున్నాయన్నారు. అవి పూర్తయితే చాలా వరకు ప్రజలకు మేలు జరుగుతుందన్నారు. అత్తాపూర్ డివిజన్ కు నిధుల మంజూరు విషయంలో చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండా విశ్వేశ్వర్ రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్ గౌడ్, బీజేపీ జిల్లా, నియోజకవర్గం, డివిజన్, శక్తి కేంద్రాల నాయకులు ఎం తగానో సహకరించారన్నారు. వారందరికి కృతజ్ఞతలు తెలియజేస్తున్నానని మోంద్ర సంగీత గౌరీశంకర్ తెలిపారు.



## పదవి విరమణ చేసిన హెడ్మాస్టర్ శ్రీనివాస్ రెడ్డిని సన్మానించిన సీనియర్ నాయకులు భీమ్ రెడ్డి

**కొత్తకోట, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం)**


పదవి విరమణ చేసిన గెజిటెడ్ హెడ్ మాస్టర్ జి శ్రీనివాస్ రెడ్డి ను కొత్తకోట మండలం సీనియర్ నాయకులు మూలమల్ల భీమ్ రెడ్డి సన్మానించారు. శ్రీనివాస్ రెడ్డి ఇటీవల పదవి విరమణ చేశారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి మాట్లాడుతూ... విద్యారంగ పదవిలో శ్రీనివాస్ రెడ్డి చేసిన సేవలు స్ఫూర్తిదాయకమన్నారు. శ్రీనివాస్ రెడ్డి తాను పని చేసిన ప్రతి స్కూల్ నందు ప్రత్యేక శ్రద్ధ కన బరచి విద్యార్థులను క్రమ శిక్షణ బాటలో నడిపించారన్నారు. శ్రీనివాస్ రెడ్డి శేష జీవితం ఆరోగ్యం సుఖసంతోషాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు.

## పెళ్లిళ్లలో బంధువుగా నటిస్తూ..

# బంగారు ఆభరణాలు ఎత్తుకెళ్తున్న మహిళ

**5.5 తులాల బంగారు ఆభరణాల స్వాధీనం**

**బుద్వేల్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం) :**



పెళ్లిళ్లకు హాజరవుతూ.. బంధువుగా నటిస్తూ.. వివాహ మండపాలలో జరిగే కార్యక్రమాలకు హాజరై బంగారు ఆభరణాలు దొంగిలించిన కేసులో కిలాడీ లేడీని అరెస్టు చేసి రిమాండ్ కు తరలించారు. మైలార్ దేవ్ పల్లి డి ఐ మాక్సూద్ అలీ కిలాడీ లేడీ వివరాలను మంగళవారం తెలిపారు. ఎర్రకుంటలో నివాసముండే షాహిన్ బేగం (40) బ్యూటీషియన్ గా పనిచేస్తుంది. జనవరి 14న సిటీ ప్యాలెస్ ఫంక్షన్ హాల్ లో జరిగిన వివాహ వేడుకల్లో షాహిన్ బేగం పాల్గొంది. కుక్కట్ పల్లికి చెందిన ఇర్ఫాన్ భార్య 5.5 తులాల బంగారు గొలుసు ను తన బ్యాగులో పెట్టుకుని వివాహ మండపంలో తన బ్యాగును పెట్టింది. బ్యాగులు బంగారు ఆభరణాలు ఉన్న విషయాన్ని గుర్తించిన షహీన్ బేగం బ్యాగుతో ఉడాయించింది. ఇర్ఫాన్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. గత 25 రోజుల నుంచి సీసీ కెమెరాలు పరిశీలించిన పోలీసులు చివరికి షాహిన్ బేగంను నిందితురాలుగా గుర్తించారు. షహీన్ బేగం పై గతంలో రెండు కేసులు నమోదైనట్లు తెలిపారు. భర్తను హత్య చేసిన కేసులో ముద్దాయిగా ఉందని చెప్పారు. షహీన్ బేగం నుంచి ఐదున్నర తులాల బంగారు ఆభరణాలను స్వాధీనం చేసుకుని రిమాండ్ కు తరలించారు.




## డిస్ట్రిబ్యూషన్ సెంటర్‌ని సందర్శించిన కలెక్టర్

**పోలింగ్ ప్రశాంతంగా జరగాలి**

**చెక్ లిస్ట్ ప్రకారం అన్ని చూసుకోండి**

**పోలింగ్ సిబ్బంది కి ఎలాంటి ఇబ్బంది కలగకూడదు**

**ఏర్పాట్లు బాగుండాలి**

**జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం):**

మున్సిపల్ ఎన్నికల నేపథ్యంలో.. నేడు జరిగే పోలింగ్ ప్రక్రియని సజావుగా, ప్రశాంతంగా నిర్వహించాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ అన్నారు. మున్సిపల్ ఎన్నికల పోలింగ్ నిర్వహణ కోసం సిబ్బంది కి ఎన్నికల సామాగ్రి పంపిణి నిమిత్తం స్థానిక ఏకశిల బిఈడి కాలేజ్ లో ఏర్పాటు చేసిన డిస్ట్రిబ్యూషన్ కేంద్రాన్ని మంగళవారం అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ తో కలిసి జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ సందర్శించి మెటీరియల్ పంపిణి ప్రక్రియ ని, భోజనం, కౌంటింగ్ ఏర్పాట్ల ను పరిశీలించి తగు సూచనలు చేశారు. డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో సిబ్బందికి మౌలిక సదుపాయాలు కల్పించాలని, లైటింగ్, త్రాగునీరు, లంచ్, డిన్నర్ ఏర్పాట్లు బాగుండాలని, సిబ్బందిని, బ్యాలెట్ బాక్సులు, బ్యాలెట్ పేపర్లు పోలింగ్ కేంద్రాలకు చేర్చుట గాను ఎస్కార్ట్ వాహనంతో వెళ్లాలని, బ్యాలెట్ బాక్స్ లు సరిగ్గా ఉన్నాయా లేవో సరిచూసుకోని సిబ్బందికి ఇవ్వాలని కలెక్టర్ తెలిపారు. ప్రతీ పోలింగ్ స్టేషన్ లో జరుగుతున్న పోలింగ్ తీరును నిశితంగా పరిశీలించాలని, ఏమైనా సమస్య లు గమనిస్తే.. వెంటనే తమ దృష్టి కి తీసుకరావాలని మైక్రో అబ్జర్వర్ లకి కలెక్టర్ తెలియ జేశారు. అనంతరం స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ హాల్స్ కి చేస్తున్న ఏర్పాట్లను పరిశీలించారు. సీసీ కెమెరా ల ఏర్పాటు, బ్యాలట్ బాక్స్ లు తీసుకరావడం,టేబుల్స్ నిర్వహణ తదితర అంశాల మీద అధికారులకు కలెక్టర్ పలు సూచనలని ఇచ్చారు. ఈ కార్యక్రమం లో జనగామ ఆర్డీవో గోపి రాం, మున్సిపల్ కమిషనర్, తహసీల్దార్ తదితరులు పాల్గొన్నారు.

# వాణిజ్య వ్యాపారస్తులు జిహెచ్ఎంసి, జీఎస్టీ, ఆహార భద్రత అనుమతులు తప్పనిసరగా కలిగి ఉండాలి



**చట్ట విరుద్ధ కార్యకలాపాలు చేపడితే కఠిన చర్యలు తప్పవు**

**ఫుట్ పాతులను ఆక్రమించి వ్యాపారాలు కొనసాగించొద్దు**

**కూకట్ పల్లి సీఐ కెవి సుబ్బారావు**

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి పోలీస్ స్టేషన్ పరిధిలో గల దుకాణాలు, సంస్థల యజమానులతో మంగళవారం సీఐ సుబ్బారావు సమావేశం నిర్వహించి పలు సూచనలు చేశారు. అనంతరం సీఐ సుబ్బారావు మాట్లాడుతూ అన్ని సంస్థలు తమ వ్యాపారాలను అనుమతించబడిన సమయ పరిమితులలోపు ఖచ్చితంగా మూసివేయాలని, యజమానులు తప్పనిసరిగా జిహెచ్ఎంసి అనుమతి, వాణిజ్య లైసెన్స్, జిఎస్టి రిజిస్ట్రేషన్, కార్మిక లైసెన్స్, ఆహార భద్రత లైసెన్సులను కలిగి ఉండాలని అన్నారు. ప్రవేశ, నిష్క్రమణ పని ప్రాంతాలను కవర్ చేసే సీసీటీవీ కెమెరాలను ఏర్పాటు చేయాలని, ఫుటేజ్ యొక్క సరైన పనితీరు, భద్రతను నిర్ధారించాలని అన్నారు. ఎటువంటి చట్టవిరుద్ధ కార్యకలాపాలు, ప్రజా ఇబ్బంది, జూదం అనుమతించవద్దని యజమానులను హెచ్చరించారు.వ్యాపార ప్రయోజనాల కోసం ఫుట్పాత్‌లు, రోడ్లు లేదా ఏదైనా బహిరంగ ప్రదేశాలను ఆక్రమించవద్దని యజమానులకు సూచించారు. ఏవైనా ఉల్లంఘనలు గమనించినట్లయితే, చట్టం ప్రకారం కఠినమైన చట్టపరమైన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.ఇలాంటి సంఘటనలు పునరావృతమైతే, లేదా ఉల్లంఘనల విషయంలో, ట్రేడ్ లైసెన్స్, జీఎస్టీ రిజిస్ట్రేషన్, ఇతర చట్టబద్ధమైన లైసెన్స్‌లను రద్దు చేయడానికి అవసరమైన ప్రతిపాదనలను సంబంధిత విభాగాలకు పంపుతామని తెలిపారు. ముఖ్యంగా ఫుట్‌పాత్‌లపై వ్యాపారాలను కొనసాగించరాదని, ఒకవేళ కొనసాగిస్తే సంబంధిత అధికారుల ద్వారా అటువంటి దుకాణాలను తొలగిస్తామని కూడా హెచ్చరించారు.



# వేములవాడ శివరాత్రి ఉత్సవాలకు సిఎంకు ఆహ్వానం

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామివారి మహా శివరాత్రి జాతర మహోత్సవానికి ఆహ్వానించారు. మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్, ఆలయ ఈవో రమాదేవి, ఆలయ అర్చకులు. కలసి ఆహ్వాన పత్రిక అందచేశారు. అలాగే ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి 'కీసరగుట్ట మహా శివరాత్రి బ్రహ్మోత్సవాలు-2026' ఆహ్వానం అందజేసారు. ఈ రెండు ప్రాంతాల్లో శివరాత్రి ఉత్సవాలు విశేషంగా జరుగుతాయి. అందువల్ల వీటికి హాజరు కావాలని మంత్రి కొండా సురేఖ, దేవాదాయ శాఖ కమిషనర్ హరీష్ కోరారు.




# ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూళ్లకు సెలవులు

**సెలవులకు తోడు కలసి వచ్చిన శని,ఆదివారాలు**

**హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేలు స్కూళ్లలో చదివే విద్యార్థులకు వరుస సెలవులు వచ్చాయి. ఎందుకంటే ఈ వారంలో వరుసగా నాలుగు రోజుల పాటు స్కూల్‌లకు సెలవులు ఉండే అవకాశం ఉంది. ఈ సెలవులు రాష్ట్రవ్యాప్తంగా కాకుండా కేవలం కొన్ని జిల్లాలో మాత్రమే ఉ ండనున్నాయి. ఎందుకంటే రాష్ట్రంలో ఫిబ్రవరి 11న మున్సిపల్ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆరోజు ఎన్నికల ప్రక్రియలకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఉండేందుకు రాష్ట్రంలో ఎన్నికలు జరిగే ప్రాంతాల్లో స్కూల్‌లకు సెలవులు ప్రకటించారు. దీంతో ఈసీ అధికారులు ఫిబ్రవరి 11న ఆయా ప్రాంతాల్లోని స్కూళ్లకు సెలవులు ప్రకటిస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. ఫిబ్రవరి 11న పోలింగ్ ముగిసిన ఒక రోజు తర్వాత రాష్ట్రంలో మున్సిపల్ ఎన్నికల ఓట్ల లెక్కింపు ప్రక్రియ జరగనుంది. ఓట్ల లెక్కింపు ప్రక్రియ అనేది పోలింగ్ జరిగిన ప్రాంతాల పరిధిలోని గవర్నమెంట్, ప్రైవేట్ స్కూల్‌లో నిర్వహిస్తారు. ఈ నేపథ్యంలో కౌంటింగ్ నిర్వహించే స్కూల్‌లకు ఆరోజు అధికారులు సెలవులు ప్రకటించనున్నారు. ఈ ప్రక్రియ ముగిసిన మరుసటి రోజు అంటే ఫిబ్రవరి 14న రెండో శనివారం, ఫిబ్రవరి 15న ఆదివారం ఎలాగో హాలీడే కావడంతో వరుసగా రెండ్రోజుల పాటు రాష్ట్ర వ్యాప్తంగా స్కూల్‌లకు సెలవులు ఉండనున్నాయి. ఎన్నికలు జరిగే ప్రాంతాల్లోని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల విద్యార్థులకు ఈ వారంలో నాలుగు రోజులు పాటు సెలవులు దొరకనున్నాయి.



విలేకరుల సమావేశం అనంతరం గంగాధర్ రెడ్డి సన్మానిస్తున్న బీజేపీకార్యకర్తలు.

# గత ఐదు సంవత్సరాలుగా గచ్చిబౌలి సమగ్రాభివృద్ధే లక్ష్యం పని చేశాను

**925 కోట్లతో ఐదేళ్లలో అద్భుత ప్రగతి**

**గచ్చిబౌలి డివిజన్ కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి**

**శేరిలింగంపల్లి , ఫిబ్రవరి 10, (ప్రభాత ఉదయం)**

పార్టీలకతీతంగా అందరి సహకారంతో గచ్చిబౌలి డివిజన్‌ని ఆదర్శవంతమైన ప్రాంతంగా తీర్చిదిద్దినట్లు స్థానిక కార్పొరేటర్ గంగాధర్ రెడ్డి వెల్లడించారు. గచ్చిబౌలి కార్పొరేటర్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో గత ఐదేళ్ల కాలంలో చేపట్టిన అభివృద్ధి పనుల వివరాలను వెల్లడించారు. గత ఐదు సంవత్సరాలలో మొత్తం 925 కోట్ల రూపాయలతో డివిజన్ వ్యాప్తంగా వివిధ మౌలిక సదుపాయాల పనులను పూర్తి చేసినట్టు వివరించారు. ప్రధానంగా రోడ్ల విస్తరణ, అత్యాధునిక డ్రైనేజీ వ్యవస్థ ఏర్పాటు, వీధి దీపాల ఆధునీకరణ వంటి పనులకు పెద్దపీట వేశామన్నారు. పెరిగిన జనాభా ట్రాఫిక్ దృష్ట్యా గచ్చిబౌలిలో నిర్మించిన ఫ్లైఓవర్లు, అండర్ పాస్ పనులు ఈ ప్రాంత రూపురేఖలను మార్చాయని ఆయన పేర్కొన్నారు. కేవలం మౌలిక సదుపాయాలే కాకుండా, ప్రభుత్వ పథకాలైన కల్యాణ లక్ష్మి, ముఖ్యమంత్రి సహాయ నిధి (సీఎంఆర్ఎఫ్) ప్రయోజనాలను లబ్ధిదారులకు సకాలంలో అందేలా కృషి చేసినట్లు తెలిపారు. తను బిజెపి పార్టీ నుండి కార్పొరేటర్ గా గెలిచినప్పటికీ, అభివృద్ధి విషయంలో రాజీ పడకుండా అన్ని పార్టీల నాయకుల అధికారుల సహకారం తీసుకుని అభివృద్ధి చేసినట్లు వివరించారు. గడచిన ఐదేళ్ల ప్రయాణంలో ప్రజల సమస్యల పరిష్కారమే నా ప్రథమ ప్రాధాన్యతగా పనిచేశామన్నారు. డివిజన్ అభివృద్ధికి సహకరించిన ప్రతి ఒక్కరికీ గంగాధర్ రెడ్డి ధన్యవాదాలు తెలిపారు. పదవీ కాలం ముగిసినప్పటికీ ప్రజలకు నిత్యం అందుబాటులో ఉంటానని గంగాధర్ రెడ్డి హామీ ఇచ్చారు. భవిష్యత్తులో మరిన్ని అభివృద్ధి పనులను చేయించేందుకు అధికారులపై ఒత్తిడి తెస్తానని చెప్పారు. నానాక్ రాంగూడలో కోట్ల రూపాయలతో నిర్మించిన స్టేడియం ను డంపింగ్ యార్డ్ గా మార్చిన అధికారులపై వత్తిడి తెచ్చి రాబోయే కాలంలో స్పోర్ట్ స్టేడియం ప్రజలకు అందుబాటు వచ్చే విధంగా కృషి చేస్తానని వివరించారు. రాబోయే రోజుల్లో కూడా గచ్చిబౌలిని అంతర్జాతీయ స్థాయి ప్రమాణాలతో కూడిన డివిజన్‌గా కొనసాగించేందుకు కృషి చేస్తినని హామీ ఇచ్చారు. ఈకార్యక్రమంలో డివిజన్ బీజేపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# జనగామ జిల్లా మున్సిపల్ ఎన్నికల్లో కాంగ్రెస్ జెండా ఎగురుతుంది....

**టిపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మినారాయణ నాయక్ లకావత్**

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**



నేడు జరగనున్న మున్సిపాలిటీ ఎన్నికల్లో జనగామ జిల్లా పరిధిలో ఉన్న నియోజక వర్గాలలో అధిక సంఖ్యలో మున్సిపల్ స్థానాలను గెలుచుకుంటామని టిపీసీసీ సభ్యుడు డాక్టర్ లక్ష్మి నారాయణ నాయక్ లకావత్ తెలిపారు. మంగళవారం జనగామ లోని అయన స్వగృహంలో విలేకర్ల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ లక్ష్మి నారాయణ్ నాయక్ మాట్లాడుతూ జిల్లాలోని జనగామ, స్టేషన్ ఘనపూర్, పాలకుర్తి నియోజక వర్గ పరిధిలో ఉన్న జనగామ, స్టేషన్ ఘనపూర్, తొర్రూర్, మున్సిపాలిటీలలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురుతుందన్న ఆశా భావం వ్యక్తం చేశారు. జనగామ మున్సిపాలిటీలో ఉన్న 30 వార్డులకు గాను 22 వార్డులు కాంగ్రెస్ పార్టీ, 3 వార్డులు మిత్ర పక్ష పార్టీలు గెలవనున్నామన్నారు. 6 వార్డులలో నెక్ టూ నెక్ ఫైట్ ఉందన్నారు. స్టేషన్ ఘనపూర్ మున్సిపాలిటీలో వార్ వన్ సైడ్ జరుగుతుందని 18 వార్డులకు గాను, 15 వార్డులు కాంగ్రెస్ పార్టీ గెలువబోతున్నామన్నారు. మహబూబాబాద్ జిల్లా పరిధి (పాలకుర్తి నియోజక వర్గం) లోని తొర్రూర్, సిద్ధిపేట జిల్లా పరిధి (జనగామ నియోజకవర్గం) లోని చేర్యాల మున్సిపాలిటీలో అధిక కౌన్సిలర్ స్థానాలు గెలిచి చైర్మన్ పీఠాలను కైవసం చేసుకోబోతున్నామన్నారు. గత రెండు పర్యాయలు జనగామ మున్సిపాలిటీలో కాంగ్రెస్ పార్టీ మెజారిటీ స్థానాలను గెలుచుకున్నా, అప్పుడు అధికారంలో ఉన్న బిఆర్ఎస్ దొంగ దెబ్బ తీసి చైర్మన్ పీఠాలను కైవసం చేసుకుందన్నారు. ఈ సారి అలాంటి సంఘటనను పునరావృతం కాకుండా కాంగ్రెస్ పార్టీ జాగ్రత్తలు తీసుకుందన్నారు. జనగామ జిల్లా పరిధిలోని మున్సిపాలిటీలను పూర్తి స్థాయిలో కైవసం చేసుకొని, చైర్మన్ పీఠాలను గిఫ్ట్ గా సీఎం రేవంత్ రెడ్డికి ఇస్తామని సంతోషం వ్యక్తం చేశారు.



# కెపిహెచ్బి 9వ ఫేస్‌లోని పార్కును త్వరగా పూర్తిచేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలి

**కూకట్ పల్లి, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)**

కూకట్ పల్లి నియోజకవర్గ కెపిహెచ్బి డివిజన్ తొమ్మిదవ ఫేస్ లో గల పార్క్ లో జరుగుతున్న పనులనుమంగళవారం కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, కార్పొరేటర్ మందడి శ్రీనివాసరావు తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు ఉపయోగపడే విధంగా ఆనాటి ముఖ్యమంత్రి కేసీఆర్, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నాయకత్వంలోనే పార్కు నిర్మాణానికి పనులు ప్రారంభించామని, కేపిహెచ్బి డివిజన్ లో అనేక అభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించుకున్నామని అన్నారు. నేడు ఈ పార్కు కూడా పూర్తయితే ప్రజలకు ఎంతో ఉపయోగపడుతుందని అన్నారు. త్వరగా పార్క్ పనులను పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని అధికారులకు సూచించారు. కార్యక్రమంలో అధికారులు హెచ్ఎండిఏ, డి ఈ జీవన్ రెడ్డి, ఆర్కిటెక్ సౌజన్య, ఏ ఈ రాజీవ్, డివిజన్ అధ్యక్షుడు కృష్ణారెడ్డి, రాజేష్, పాతూరి గోపి, గంగూరి శ్రీనివాస రావు, హనుమంత రావు, రాంగోపాల్, దాశరధి, చందన శ్రీనివాస రావు, వైబిజి నాయుడు, బుచ్చిరెడ్డి, బిఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, అసోసియేషన్ సభ్యులు, కాలనీవాసులు పాల్గొన్నారు..



కలెక్టర్ కు ఆహ్వాన పత్రాన్ని ఇస్తున్న ఈవో

# మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు కలెక్టర్‌కి ఆహ్వానం

**జనగామ జిల్లా ప్రతినిధి, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం):**

జిల్లాలోని పాలకుర్తి నియోజకవర్గం కేంద్రం లో శ్రీ సోమేశ్వర లక్ష్మీనరసింహ స్వామి ఆలయంలో ఫిబ్రవరి 14 నుండి 18 వరకు జరిగే మహాశివరాత్రి జాతర బ్రహ్మోత్సవాలకు జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ కి ఆహ్వాన పత్రికను ఆలయ ఈవో లక్ష్మీ ప్రసన్న, ఆలయ ప్రధాన అర్చకులు దేవగిరి లక్ష్మన్న మంగళవారం కలెక్టర్ కార్యాలయం లో కలెక్టర్ కి అందించి ఆహ్వానం పలికారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు దేవగిరి అనిల్ కుమార్ పాల్గొన్నారు.




ట్రాఫిక్ ఇన్ స్పెక్టర్ రాజు కు వినతిపత్రం అందజేస్తున్న ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు

# శివరాంపల్లి పిల్లర్ నెంబర్ 274 వద్ద ట్రాఫిక్ సమస్య పరిష్కరించండి

**రాజేంద్ర నగర్, ఫిబ్రవరి 10(ప్రభాత ఉదయం)**

శివరాంపల్లి పీవీ ఎన్ ఆర్ ఎక్స్ ప్రెస్ వే పిల్లర్ నెంబర్ 274 వద్ద నిత్యం ఏర్పడుతున్న ట్రాఫిక్ సమస్య ను పరిష్కరించాలని ఐక్యత వెల్ఫేర్ అసోసియేషన్ నాయకులు మంగళవారం రాజేంద్ర నగర్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇక్కడ బస్టాప్ ఉండటంతో పాటు యూ టర్న్ కూడా ఉండటం నిత్యం ట్రాఫిక్ సమస్య తలెత్తుతుందని, దీని వల్ల తరచూ ప్రమాదాలు కూడ జరుగుతున్నాయని ఇన్స్పెక్టర్ సి హెచ్ రాజుకు వివరించారు. అదే విధంగా పిల్లర్ నెంబర్ 271 నుంచి 277 వరకు సర్వీస్ రోడ్డులో వ్యాపార సముదాయాలకు వచ్చే వాహనదారులు రోడ్ల పైనే అక్రమంగా వాహనాలను పార్కింగ్ చేస్తుండటం ట్రాఫిక్ సమస్యతో కాలనీ వాసులకు, ఈ మార్గంలో రాకపోకలు సాగించే వారికి ఇబ్బంది ఏర్పడుతుందని తెలిపారు. పుట్ పాత్ వ్యాపారుల వల్ల చాలా సమస్య ఉత్పన్నమవుతుందని అసోసియేషన్ అధ్యక్షులు పి. వెంకటేష్, ఉపాధ్యక్షులు డి ఆంజనేయులు, కార్యదర్శి ఎస్. శ్రీనివాస్, గణేష్ లు ఇన్స్పెక్టర్ కు వివరించారు. పలుమార్లు ట్రాఫిక్ సమస్య ఏర్పడకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయా వ్యాపారస్తులకు చెప్పిన పట్టించుకోవడంలేదని తెలిపారు. సమస్యను విన్న ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ సిహెచ్ మాట్లాడుతూ ట్రాఫిక్ సమస్య ఏర్పడుతున్న ప్రాంతాన్ని పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు అసోసియేషన్ నాయకులు తెలిపారు.



## సాగునీటి ప్రాజెక్టులు, అంతర్ రాష్ట్ర వివాదాలపై చర్చ

### కేంద్రమంత్రి సిఆర్ పాటిల్‌తో చంద్రబాబు భేటీ

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)

ఏపీ సీఎం నారా చంద్రబాబు నాయుడు ఢిల్లీ పర్యటనలో బిజీబిజీగా ఉన్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఉదయం కేంద్ర జలశక్తి మంత్రి సీఆర్ పాటిల్‌తో సీఎం సమావేశమయ్యారు. ఏపీలోని వివిధ సాగునీటి ప్రాజెక్టుల అనుమతులు, ఆర్థిక సాయం, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చ జరిగింది. రాష్ట్ర ప్రయోజనాలు, రైతుల భవిష్యత్, తాగునీటి భద్రతకు ఇవి ఎంతో ముఖ్యమని సీఎం వివరించారు. వివిధ ప్రాజెక్టులకు కేంద్ర సాయంపై పెండింగ్‌లో ఉన్న అంశాలతో పాటు, అంతర్రాష్ట్ర నీటి వివాదాల పరిష్కారంపైనా ముఖ్యమంత్రి సవివరంగా చర్చించారు. సీఎం చంద్రబాబు ఈ భేటీలో పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన ముఖ్య అంశాలను ప్రస్తావించారు. పోలవరం ప్రాజెక్టుపై ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను శాశ్వతంగా ఎత్తివేసేలా కేంద్రం నిర్ణయం తీసుకోవాలని కోరారు. ఈ ఆర్డర్ వల్ల ప్రాజెక్టు అమలులో తీవ్ర అవరోధాలు ఏర్పడుతున్నాయని వివరించారు. పోలవరం కుడి, ఎడమ ప్రధాన కాలువల సామర్థ్యం పెంపు వల్ల పెరిగిన వ్యయాన్ని రీయింబర్స్‌మెంట్ చేయాలన్నారు. అలాగే ఫేజ్-ఎఎ పనులకు ఆర్థిక సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. ఫేజ్-ఎఎలో భూసేకరణ, పునరావాసం, రక్షణ కట్టలు వంటి పనులు చేపట్టాల్సి ఉందని, దీనికి అదనంగా సుమారు రూ.32,000 కోట్ల నిధులు అవసరమని ముఖ్యమంత్రి తెలిపారు. వరద జలాలను వర్షాభావ ప్రాంతాలకు తరలించే లక్ష్యంతో ప్రతిపాదిత పోలవరం-నల్లమల సాగర్ లింక్ ప్రాజెక్టుపైనా చర్చ జరిగింది. తాగు, సాగునీరు, పరిశ్రమల అవసరాలు తీర్చే కీలక ప్రాజెక్టుగా చెప్పుకొచ్చారు సీఎం. జాతీయ నదుల అనుసంధాన విధానంలో భాగంగా దీనికి అనుమతులు మంజూరు చేసి సాంకేతిక, ఆర్థిక సాయం అందించాలని కోరారు. ఆంధ్రప్రదేశ్-ఒడిశా మధ్య వంశధార నీటి వివాదం పరిష్కారించాలని కోరారు. వంశధార నీటి వివాద ట్రిబ్యునల్ (వీడబ్ల్యుడీటీ) తుది నివేదికను వెంటనే గెజిట్‌లో ప్రచురించాలని, దీని ఆధారంగా నేరడి బ్యారేజ్ నిర్మాణానికి మార్గం సుగమం చేయాలని ముఖ్యమంత్రి విన్నవించారు. గోదావరి జలాల పంపకంపై ఆంధ్రప్రదేశ్-తెలంగాణ మధ్య కొనసాగుతున్న వివాదంపై కూడా చర్చించారు. ఈ వివాదం పరిష్కారం కోసం గోదావరి నీటి వివాదాల ట్రిబ్యునల్‌ను తక్షణమే ఏర్పాటు చేయాలన్నారు సీఎం. ఎగువ కృష్ణాపై కర్ణాటక ప్రభుత్వం ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంపునకు చేపట్టిన చర్యలపై సీఎం తీవ్ర అభ్యంతరం తెలిపారు. ఆల్మట్టి డ్యామ్ ఎత్తు పెంచడం వల్ల ఆంధ్రప్రదేశ్‌కు వచ్చే దిగువ ప్రవాహ జలాలపై తీవ్ర ప్రభావం పడుతుందని ముఖ్యమంత్రి చంద్రబాబు పేర్కొన్నారు. ఈ సమావేశంలో కేంద్ర మంత్రులు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్, ఏపీ ఆర్థికమంత్రి పయ్యావుల కేశవ్, టీడీపీ ఎంపీలు, ఇరిగేషన్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## మైనర్ల ఆత్మహత్యలపై దృష్టి సారించాలి

(సి.హెచ్.ప్రతాప్)



గాజియాబాద్‌లో ఇటీవల చోటుచేసుకున్న మైనర్ల ఆత్మహత్యలు సమాజంలోని ఒక భయంకరమైన నిశ్శబ్దాన్ని మన కళ్లముందుకు తెచ్చాయి. ఈ విషాద ఘటనలు కేవలం వ్యక్తిగత బలహీనతలు కావు, ఇవి మన దేశంలోని కౌమార దశలో ఉన్న పిల్లలు ఎదుర్కొంటున్న తీవ్రమైన ఒంటరితనానికి నిదర్శనాలు. మారుతున్న జీవనశైలి, విచ్ఛిన్నమవుతున్న ఉమ్మడి కుటుంబ వ్యవస్థలు, సాంకేతికతపై అతిగా ఆధారపడటం వల్ల పిల్లలు తమ మనసులోని భావాలను పంచుకోవడానికి ఎవరూ లేక ఒంటరితనం అనే అగాధంలోకి కూరుకుపోతున్నారు. స్నేహితులతో కలిసి ఆడుకోవాల్సిన వయసులో, సామాజిక మాధ్యమాల మాయలో పడి బాహ్య ప్రపంచంతో సంబంధాలు తెంచుకుంటున్న తీరు ఆందోళన కలిగిస్తోంది. ఈ ఒంటరితనం అనేది ఒక మానసిక రుగ్మతగా మారకముందే దీనిని అరికట్టడానికి ఒక పటిష్టమైన ప్రభుత్వ విధానం అవసరం ఎంతైనా ఉంది. ఆధునిక కాలంలో పిల్లలు భౌతికంగా అందరి మధ్య ఉన్నప్పటికీ, మానసికంగా ఒంటరిగా మిగిలిపోతున్నారు. ఈ సమస్యను గుర్తించడంలో వైఫల్యం చెందడం వల్లనే ఇలాంటి ప్రాణనష్టాలు సంభవిస్తున్నాయి. భావప్రకటనకు వేదిక లేకపోవడం పిల్లల మనసులను కృంగదీస్తోంది.

నేటి విద్యావ్యవస్థలో కేవలం మార్కుల వేటలోనే విద్యార్థులు గడుపుతున్నారు. పాఠశాలల్లో ఒత్తిడిని ఎలా జయించాలో నేర్పడం కంటే పోటీలో ఎలా నెగ్గాలో మాత్రమే బోధిస్తున్నారు. గాజియాబాద్ ఘటనలు గమనిస్తే, పిల్లలు తమ ఆవేదనను ఎవరికీ చెప్పుకోలేక తీవ్రమైన మానసిక సంఘర్షణకు గురవుతున్నారని అర్థమవుతోంది. తల్లిదండ్రులు ఇద్దరూ ఉద్యోగాల్లో నిమగ్నం కావడం వల్ల ఇంట్లో కూడా వారికి తగినంత సమయం దొరకడం లేదు. ఈ లోటును పూడ్చుకోవడానికి పిల్లలు ఇంటర్నెట్ ప్రపంచాన్ని ఆశ్రయిస్తున్నారు, అది వారిని మరింత ఒంటరిగా మారుస్తోంది. కేవలం ఆర్థిక వృద్ధిని మాత్రమే కాకుండా, ప్రజల మానసిక ఆరోగ్యాన్ని కూడా ఒక ప్రాధాన్యతగా గుర్తించే సమయం వచ్చింది. ఒంటరితనాన్ని ఒక సామాజిక సమస్యగా పరిగణించి దానికి పరిష్కారాలు వెతకడానికి విధానకర్తలు చొరవ చూపాలి. సామాజిక పరస్పర చర్యలు తగ్గడం వల్ల పిల్లల వ్యక్తిత్వం మొగ్గలోనే వాడిపోతోంది. ఇది దేశ భవిష్యత్తుపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. పోటీ ప్రపంచంలో పిల్లలు తమను తాము ఇతరులతో పోల్చుకుంటూ ఆత్మన్యూనతకు లోనవుతున్నారు.

ప్రభుత్వాలు ఇప్పటికైనా మానసిక ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ పెట్టాలి. ప్రతి పాఠశాలలో కేవలం పేరుకే కాకుండా, నిజంగా పిల్లల సమస్యలను వినే నిపుణులైన కౌన్సిలర్లు ఉండాలి. పిల్లలు తమ మనసు విప్పి మాట్లాడేలా స్నేహపూర్వక వాతావరణాన్ని కల్పించాలి. అలాగే గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో యువత కోసం కమ్యూనిటీ కేంద్రాలను ఏర్పాటు చేసి, వారు సామాజికంగా ఒకరితో ఒకరు కలిసేలా ప్రోత్సహించాలి. జపాన్, బ్రిటన్ వంటి దేశాలు ఒంటరితనాన్ని ఎదుర్కోవడానికి ప్రత్యేకంగా మంత్రులను, విభాగాలను ఏర్పాటు చేసుకున్నాయి. భారతదేశం కూడా అటువంటి దిశగా అడుగులు వేయాలి. గ్రామ స్థాయి నుంచి పట్టణ స్థాయి వరకు స్థానిక ప్రభుత్వాలు ఈ సమస్యను తమ ప్రాధాన్యత అంశంగా మార్చుకోవాలి. యువతలో పెరుగుతున్న ఈ ఒంటరితనాన్ని గుర్తించడానికి ప్రత్యేక సర్వేలు నిర్వహించడం ద్వారా అసలు లోటు ఎక్కడ ఉందో తెలుసుకోవచ్చు. సమాజంలో మానసిక సమస్యలపై ఉన్న వివక్షను తొలగించడానికి విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలి. మానసిక క్షేమం అనేది విలాసం కాదు, అది ఒక ప్రాథమిక హక్కు అని ప్రభుత్వాలు గుర్తించాలి. ఇందుకు అవసరమైన బడ్జెట్ కేటాయింపులు పెంచడం ద్వారా క్షేత్రస్థాయిలో మార్పు తీసుకురావచ్చు. మన దేశంలోని జనాభా ప్రాతిపదికన మానసిక నిపుణుల సంఖ్య పెరగాలి. ప్రతి ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మానసిక సమస్యలకు చికిత్స అందించేలా సౌకర్యాలు కల్పించాలి.

తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లల ప్రవర్తనలో వచ్చే మార్పులను నిశితంగా గమనించాలి. వారు మౌనంగా ఉంటున్నారా, ఆహారపు అలవాట్లు మారాయా, స్నేహితులకు దూరంగా ఉంటున్నారా వంటి అంశాలను గుర్తించి వెంటనే వారితో సంభాషించాలి. ఒంటరితనం అనేది మనిషిని లోలోపలే దహించివేసే మహమ్మారి. దీనిని కేవలం కుటుంబ సమస్యగా చూడకుండా సామాజిక బాధ్యతగా స్వీకరించాలి. ఒక సమగ్రమైన విధానం రూపొందించడం ద్వారా మాత్రమే ఇలాంటి విషాదకరమైన ఆత్మహత్యలను నిరోధించవచ్చు. రేపటి పౌరులైన పిల్లలకు బలమైన మానసిక ధైర్యాన్ని అందించడం మనందరి ప్రాథమిక కర్తవ్యం. ప్రభుత్వం, సమాజం, కుటుంబం కలిసికట్టుగా అడుగులు వేసినప్పుడే గాజియాబాద్ వంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడగలం. పిల్లలకు కేవలం భౌతిక వసతులు కల్పిస్తే సరిపోదు, వారికి కావలసినది ఆత్మీయమైన ఓదార్పు తోపాటు భరోసా ఇచ్చే తోడు. ప్రతి ఇంటిలోనూ, ప్రతి పాఠశాలలోనూ ప్రేమపూర్వకమైన సంభాషణలు జరిగినప్పుడే మన పిల్లల భవిష్యత్తు క్షేమంగా ఉంటుంది. ఒంటరితనం అనే చీకటిని పారద్రోలడానికి వెలుగునిచ్చే విధానాలే నేటి తక్షణ అవసరం. పాఠ్యప్రణాళికలో కూడా మానసిక వికాసానికి సంబంధించిన పాఠాలను చేర్చాలి. డిజిటల్ ప్రపంచంలో వేల సంఖ్యలో స్నేహితులు ఉన్నప్పటికీ, నిజజీవితంలో పలకరించే మనిషి లేకపోవడం నేటి తరంలో అతి పెద్ద వైరుధ్యం. ఈ అంతరాన్ని తగ్గించే దిశగా సామాజిక కార్యక్రమాలు ఊపందుకోవాలి. పిల్లలు సెల్‌ఫోన్లకు కాకుండా తోటి మనుషులకు దగ్గరయ్యేలా చూడటం ప్రాథమికంగా ఇంటి నుంచే మొదలవ్వాలి. అప్పుడే మనం ఆశించిన ఆరోగ్యకరమైన తరాలను చూడగలం. మౌనాన్ని ఛేదించి మాట్లాడటం నేర్పడం వల్ల ఎన్నో ప్రాణాలను కాపాడవచ్చు. మన పిల్లలకు మనం ఇచ్చే అతిపెద్ద ఆస్తి వారి మానసిక ధైర్యమే కావాలి. ఇది కేవలం వ్యక్తుల బాధ్యత మాత్రమే కాదు, మొత్తం వ్యవస్థ యొక్క కర్తవ్యం.

## వ్యవసాయ రంగంలో సంస్కరణలు చేపట్టాలి



భారతదేశ ఆర్థిక వ్యవస్థకు వ్యవసాయం వెన్నెముక వంటిది. మారుతున్న ప్రపంచ వాణిజ్య సమీకరణల నేపథ్యంలో అమెరికాతో మన వ్యవసాయ సంబంధాలు అత్యంత కీలకమైన మలుపులో ఉన్నాయి. గమనించాల్సిన ప్రధానాంశం ఏమిటంటే భారతదేశం అమెరికా నుండి దిగుమతి చేసుకునే వ్యవసాయ ఉత్పత్తుల కంటే అక్కడికి ఎగుమతి చేసే ఉత్పత్తులే ఎక్కువ. ఈ నేపథ్యంలో ఎగుమతి ప్రయోజనాలను కాపాడుకోవడంతో పాటు స్థానిక రైతుల ప్రయోజనాలను రక్షించడం మధ్య సమతుల్యత పాటించడం ఇప్పుడు అనివార్యంగా మారింది. వ్యవసాయ రంగంలో తక్షణమే లభించే విజయాలను అందిపుచ్చుకోవడంపై భారత్ దృష్టి సారించాలి. ముఖ్యంగా బాస్మతీ బియ్యం, సుగంధ ద్రవ్యాలు, రొయ్యలు వంటి ఉత్పత్తులకు అమెరికాలో విపరీతమైన గిరాకీ ఉంది. వీటి ఎగుమతులకు ఎటువంటి ఆటంకాలు కలగకుండా చూసుకోవడం చాలా ముఖ్యం. అమెరికా విధించే కఠినమైన నాణ్యతా ప్రమాణాలను అధిగమించేలా మన ఉత్పత్తుల నాణ్యతను పెంచడం ద్వారా అందుబాటులో ఉన్న అవకాశాలను సులభంగా అందిపుచ్చుకోవచ్చు. ఎగుమతి ప్రయోజనాలను రక్షించుకోవడం అంటే కేవలం వ్యాపారం చేయడం మాత్రమే కాదు దేశంలోని లక్షలాది మంది రైతులు, మత్స్యకారుల జీవనోపాధిని కాపాడటం కూడా అని మనం గుర్తించాలి.

అమెరికా తరచుగా తన పాడి ఉత్పత్తులు, పప్పు ధాన్యాలు, పండ్ల కోసం భారత మార్కెట్‌ను తెరవాలని ఒత్తిడి తెస్తుంటుంది. అయితే ఇక్కడ మనం ముందుకు వెళ్లే కొద్దీ అత్యంత జాగ్రత్తగా వ్యవహరించాలి. భారతదేశంలో వ్యవసాయం కేవలం వ్యాపారం కాదు అది ఒక సామాజిక భద్రత. అమెరికా నుంచి భారీగా సబ్సిడీ పొందిన ఉత్పత్తులు భారత మార్కెట్‌లోకి ప్రవహిస్తే ఇక్కడి సన్నకారు రైతులు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉంది. అందుకే దిగుమతి సుంకాలను తగ్గించే విషయంలో గానీ మార్కెట్ ప్రవేశం ఇచ్చే విషయంలో గానీ అత్యంత వ్యూహాత్మకంగా వ్యవహరించాలి. భారతదేశం తన ఎగుమతి ఆసక్తులను కాపాడుకోవడానికి సిద్ధంగా ఉండాలి. ఉదాహరణకు సముద్ర ఉత్పత్తుల ఎగుమతిలో భారత్ అగ్రగామిగా ఉంది. అమెరికా ఒకవేళ మన రొయ్యల ఎగుమతులపై ఆంక్షలు విధిస్తే అది దేశ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం చూపుతుంది. కాబట్టి మన ఎగుమతి ప్రయోజనాలను గట్టిగా వాదించడం ఎంత ముఖ్యమో అదే సమయంలో విదేశీ దిగుమతుల నుండి మన దేశీయ ఉత్పత్తిదారులను రక్షించేందుకు రక్షణ కవచాలను నిర్మించడం కూడా అంతే ముఖ్యం.

మన దేశ వ్యవసాయ విధానం కేవలం వాణిజ్య పరంగానే కాకుండా ఆహార భద్రతను దృష్టిలో ఉంచుకుని సాగాలి. విదేశీ మార్కెట్లలో మన స్థానాన్ని సుస్థిరం చేసుకుంటూనే స్వదేశీ రైతుల ప్రయోజనాలకు విఘాతం కలగకుండా చూసుకోవడమే అసలైన విజయం. అంతర్జాతీయ వేదికలపై చర్చలు జరిపేటప్పుడు మన ఎగుమతులకు ఉన్న డిమాండ్‌ను బేరసారాల అస్త్రంగా వాడుకోవాలి. తద్వారా అటు ఎగుమతిదారులు ఇటు స్థానిక రైతులు ఇద్దరూ లాభపడేలా దీర్ఘకాలిక ప్రణాళికలు రూపొందించుకోవాలి. ఈ ద్వంద్వ వ్యూహమే భారత వ్యవసాయ రంగాన్ని ప్రపంచ స్థాయికి తీసుకెళ్తుంది. మన రైతులు పండించే పంటలకు గిట్టుబాటు ధర లభించడంతో పాటు ప్రపంచ వ్యాప్తంగా భారతీయ ముద్ర పడాలంటే నాణ్యత విషయంలో రాజీ పడకూడదు. అమెరికా వంటి దేశాలతో వాణిజ్య ఒప్పందాలు చేసుకునేటప్పుడు మన బలహీనతలను కాకుండా బలాలను ప్రదర్శించాలి. భారతీయ సుగంధ ద్రవ్యాలకు ఉన్న ప్రాచీన గుర్తింపును ఆధునిక సాంకేతికతతో జోడించి ఎగుమతులను మరింత పెంచాలి. అప్పుడే మనం దిగుమతుల భయం లేకుండా స్వేచ్ఛా వాణిజ్యంలో విజేతలుగా నిలవగలం. దేశీయంగా నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, రైతులు నేరుగా ఎగుమతిదారులతో అనుసంధానం అయ్యేలా చూడటం వల్ల మధ్యవర్తుల ప్రమేయం తగ్గి రైతులకు అధిక లాభాలు చేకూరుతాయి. ఈ దిశగా అడుగులు వేయడం వల్ల భారత వ్యవసాయ రంగం స్వయంసమృద్ధి సాధించడమే కాకుండా ప్రపంచ ఆహార గిన్నెగా మారుతుంది.

### సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం

## హరీష్, రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో

### మరోమారు విమర్శలు గుప్పించిన కవిత

హైదరాబాద్, ఫిబ్రవరి 10 (ప్రభాత ఉదయం)



కేవలం సిద్దిపేటకే నిధులు విడుదలలో ఆంతర్యం ఏమిటని, హరీష్ రావు, సిఎం రేవంత్ మధ్య ఉన్న బంధం ఏమిటో చెప్పాలని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ బూతుల వర్షం ఆగిపోవడం సంతోషంగా ఉందని కల్వకుంట్ల కవిత అన్నారు. మున్సిపల్ ఎన్నికల ప్రచారం చూశాక.. పార్టీ గుర్తులు లేకుండా ఎన్నికలు జరిగితే బాగుండేదని కవిత అభిప్రాయపడ్డారు. ముఖ్యమంత్రి సొంత జిల్లాలో మంచినీరు, పారిశుధ్యం లోపిస్తోందని, ఈ అంశాలపై ఎన్నికల ప్రచారంలో చర్చ జరగలేదని ఆమె వ్యాఖ్యానించారు. మున్సిపల్ ఎన్నికల్లో మంచి వ్యక్తులను ఎన్నుకోవాలని ప్రజలకు సూచించారు. కేవలం సిద్ధిపేట మున్సిపాలిటీకి మాత్రమే నిధులు మంజూరు అయ్యాయని.. హరీష్ రావు, ముఖ్యమంత్రికి మధ్య ఏముందో అర్థం చేసుకోవాలని కవిత అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సంపద సృష్టించకుండా.. ఆస్తులను అమ్ముతోందని ఆగ్రహం వ్యక్తం చేశారు. రాబోయే బడ్జెట్‌లో అన్ని వర్గాలకూ న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. 50 శాతం మంది రైతులకు ఇంకా రుణమాఫీ చేయలేదని వెల్లడించారు. రుణమాఫీపై చర్చకు తాము సిద్ధమని.. సచివాలయాలనికి రమ్మంటారా.. ముఖ్యమంత్రి సొంత జిల్లాకు రమ్మంటారా అంటూ ప్రశ్నించారు. ముఖ్యమంత్రి ఇప్పటికైనా నిజాలు చెప్పాలన్నారు. ఆర్థిక మంత్రి భట్టి విక్రమార్కకు జాగృతి తరపున వినతి పత్రం అందిస్తామని కవిత తెలిపారు. లేబర్ కోడ్‌కు వ్యతిరేకంగా 12వ తేదీన బంద్‌కు జాగృతి మద్దతు ఇస్తోందని వెల్లడించారు. ఈ క్రమంలోనే ఎంఐఎం పార్టీ పొద్దు తిరుగుడు పువ్వులా.. ఎవరు అధికారంలో ఉంటే వారి వెంట ఉంటుందని సెటైర్లు వేశారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాయల తెలంగాణకు ఒవైసీ బ్రదర్స్ మద్దతు ఇచ్చారని, రేవంత్ రెడ్డి ఆర్ఎస్ఎస్ మనిషి అన్న ఒవైసీ.. జూబ్లీహిల్స్ ఎన్నికల్లో కాంగ్రెస్‌కు సపోర్ట్ చేశారని కవిత విమర్శించారు.

Printed and Published **MEKALA DAMODAR REDDY** on behalf of DBC Publications, and Printed at Vanitha Graphics, H.No. 3-3-76/123/21, Maruthi Enclave, Attapur, Rajendra Nagar, Ranga Reddy, Telangana-500048. and Published at: H.No. 6-2-4/2, 1st Floor, Shivarampally , NPA, Rajendra Nagar, Ranga Reddy Telangana-500052. **Editor: MEKALA DAMODAR REDDY. "RNI. Title- Code: TELTEL12231**. Cell:9391089608